పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 733 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ శుక్రవారం 2.10.2026 పేజీలు : 8 వెల : 4/-

## రాయలసీమలో లక్ష కోట్లతో

# గ్లోబల్ హార్టికల్చర్ హబ్

**రాయలసీమను ఫ్రూట్ బౌల్‌గా మార్చే గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం**




- రూ.1 లక్ష కోట్ల భారీ బడ్జెట్‌తో మూడు దశల్లో ప్రాజెక్టు అమలు 2లో
- మదనపల్లెలో నిర్మల, చంద్రబాబు, పవన్ చేతుల మీదుగా పనుల ప్రారంభం
- భారత్‌లోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన
- పది జిల్లాల్లో ఉద్యాన సాగు విస్తరణ.. 9.6 లక్షల మంది రైతులకు లబ్ధి



# త్వరలో డీఎస్సీ 2.0: మంత్రి లోకేశ్

- పదో తరగతి ఫలితాల కోసం 'మిషన్ మార్క్' పకడ్బందీగా అమలు
- యూనివర్సిటీల్లో 1523 అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు
- స్కూల్ డ్రాపౌట్ల నివారణకు 'జీరో డ్రాప్ అవుట్ మిషన్'
- విశాఖలో ఏయూ శతాబ్ది ఉత్సవాల గుర్తుగా ప్రతిష్టాత్మక గ్రంథాలయం

నెల రోజుల్లోపు డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి పోస్టింగ్ ఉత్తర్వుల జారీ వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం తరువాయి 2లో



## కోట్లాది యువత ఆశల వేదిక

# యూపీఎస్సీ: ప్రధాని మోదీ

- యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ 2లో

## వారానికి 5 రోజుల బ్యాంకింగ్?

# వైరల్ వార్తపై కేంద్రం క్లారిటీ

- ప్రతి శనివారం బ్యాంకులకు సెలవంటూ వైరల్ గెజిట్
- అది నకిలీదని వెల్లడించిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్
- ఆర్థిక శాఖ ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదని స్పష్టీకరణ
- రెండు, నాలుగో శనివారాలు మాత్రమే సాధారణ సెలవులు
- సమాచారాన్ని అధికారిక వర్గాల నుంచి నిర్ధారించుకోవాలని



### పీఐబీ సూచన

ప్రభుత్వ రంగ బ్యాంకులకు ప్రతి శనివారం సెలవు ప్రకటించారంటూ సోషల్ మీడియాలో గెజిట్ నోటిఫికేషన్ వైరలవుతోంది. అయితే అది నకిలీదని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ స్పష్టం చేసింది. ఇలాంటి నోటిఫికేషన్‌ను ఆర్థిక మంత్రిత్వ శాఖలోని తరువాయి 2లో

## ఫ్లైదుబాయ్ పైలట్‌కు

# 'గుజరాత్ గరిమా' అవార్డు

- పైలట్ స్మిత్ మచ్చర్‌కు 'విశిష్ట గుజరాత్ గరిమా అవార్డు'
- సహ పైలట్ దాడి చేసినా 174 మంది ప్రాణాలు కాపాడిన వైనం
- స్మిత్‌ను 'గుజరాతీ వీర పుత్రుడు'గా అభివర్ణించిన సీఎం 2లో
- అతడు త్వరగా కోలుకోవాలని సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు





## వాణిజ్య గ్యాస్ ధర పెంపు..

# పండగ సీజన్‌లో పిడుగు

- ఢిల్లీలో రూ. 62.50 పెరిగి రూ. 2,810కి చేరిన 19 కిలోల సిలిండర్
- హోటళ్లు, రెస్టారెంట్లపై ప్రభావం చూపే అవకాశం
- గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరల్లో మార్పు లేదు

దేశవ్యాప్తంగా పండగల సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో వాణిజ్య వినియోగదారులపై పెను భారం పడింది. 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు మరోసారి పెంచాయి. ఈ కొత్త ధరలు అక్టోబర్ 1వ తేదీ నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే, గృహ వినియోగదారులకు ఊరటనిస్తూ 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు.

తరువాయి 2లో

## యూఎస్ వార్ ప్లాన్స్..

# తెరపైకి ఎలాన్ మస్క్!

- ప్రాజెక్టుకు ఎలాన్ మస్క్ సహా ముగ్గురి నేతృత్వం
- 120 రోజుల్లో నివేదిక సమర్పణకు గడువు
- భూగర్భం నుంచి అంతరిక్షం వరకు యుద్ధాలపై అధ్యయనం
- స్వయంప్రతిపత్తి యుద్ధ వ్యవస్థలకు ప్రత్యేక కమాండ్
- సైనిక స్థావరాల భద్రతకు ఫోర్ట్రెస్ అమెరికా



2లో

## 125 ఏళ్ల రికార్డు బ్రేక్..

# ఈశాన్య భారత్‌కు కనీవినీ ఎరుగని కరువు

- ఈశాన్యంలో 125 ఏళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ వర్షపాతం నమోదు
- జూన్-సెప్టెంబర్ మధ్య రికార్డు స్థాయిలో వర్షపాత లోటు
- అస్సాం, మేఘాలయ, అరుణాచల్‌లో నాలుగు నెలలుగా వర్షాభావం
- సెప్టెంబర్‌లోనూ అధిక ఉష్ణోగ్రతలు.. ఆరో అత్యధికంగా రికార్డ్



- దేశవ్యాప్తంగానూ ఈ ఏడాది సాధారణం కన్నా తక్కువ వర్షపాతం

ఈశాన్య భారతదేశం గత 125 ఏళ్లలో ఎన్నడూ లేనంత తీవ్రమైన వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో అత్యంత తక్కువ తరువాయి 2లో

# రాయలసీమలో లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్

రాయలసీమ రూపురేఖలను సమూలంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్తర ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతాన్ని దేశానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' ఏర్పాటుకు అంకురార్పణ చేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్టు పనులను లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ. 1 లక్ష కోట్ల భారీ వ్యయంతో మూడు దశల్లో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 40,352 కోట్లు భరించనుండగా, ప్రైవేటు రంగం నుంచి రూ. 60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

రాయలసీమ, ప్రకాశం ప్రాంతాల్లోని 10 జిల్లాలకు చెందిన 303 మండలాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. 'విత్తనం నుంచి ఎగుమతి వరకు' (సీడ్ టు షిప్‌మెంట్) అనే సమగ్ర విధానంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. దీని ద్వారా ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన సాగును మరో 6 లక్షల హెక్టార్లకు విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వార్షిక ఉత్పత్తిని 222 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 435 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడం ద్వారా సుమారు 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా సాగునీటి వనరులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల అనుసంధానం, లాజిస్టిక్స్ వంటి కీలక మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది. మామిడి, అరటి, దానిమ్మ, టమాటాతో పాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి విభిన్న తరహా పంటల సాగును కూడా ప్రోత్సహించనున్నారు.

*** దేశంలోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్**

ఈ కార్యక్రమంలో భాగంగా మదనపల్లెలోనే దేశంలోనే మొట్టమొదటి 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పారిశ్రామిక



రంగంలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' (ఐఎస్‌బీ) తరహాలోనే, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో ఈ సంస్థ కార్యకలాపాలు సాగించనుంది. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మార్కెట్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించి ఈ సంస్థ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తుంది. తద్వారా 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో 'ఫ్రూట్ బౌల్'గా కూడా నిలపాలన్నది ప్రభుత్వ దృఢ సంకల్పంగా స్పష్టమవుతోంది.

# యూఎస్ వార్ ప్లాన్స్..
# తెరపైకి ఎలాన్ మస్క్!

భవిష్యత్తులో యుద్ధాలు ఎలా ఉండబోతున్నాయి? వాటిని ఎదుర్కొనేందుకు ఎలాంటి అధునాతన సాంకేతికత అవసరం? సైనిక రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని ఎలా కొనసాగించాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికేందుకు అమెరికా రక్షణ శాఖ కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్, రక్షణ రంగ సంస్థ ఆండ్యూరిల్ వ్యవస్థాపకుడు పామర్ లక్కీ, అమెరికా మాజీ ప్రతినిధుల సభ స్పీకర్ న్యూట్ గింగ్రిచ్‌లకు కీలక బాధ్యతలు అప్పగించింది.

**120 రోజుల్లో నివేదిక**

అమెరికా రక్షణ శాఖ ప్రారంభించిన 'ప్రాజెక్ట్ మెరిడియన్'కు ఈ ముగ్గురు సంయుక్తంగా నాయకత్వం వహించనున్నారు. రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. భవిష్యత్తు యుద్ధాల్లో అమెరికాకు అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన ఆయుధ వ్యవస్థలు, సైనిక సామర్థ్యాలను ఈ బృందం అధ్యయనం చేయనుంది. ప్రాజెక్టు ప్రారంభమైన 120 రోజుల్లోగా నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఇందులోని ప్రధాన వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచనున్నారు. రహస్య సమాచారంతో ప్రత్యేక అనుబంధాన్ని కూడా రూపొందించనున్నారు.

**భూమి నుంచి అంతరిక్షం వరకు..**

భవిష్యత్తు యుద్ధాల్లో భూగర్భ ప్రాంతాల నుంచి భూమి, చంద్రుడి మధ్య ఉన్న అంతరిక్ష ప్రాంతం వరకు ఎదురయ్యే సవాళ్లను ఈ అధ్యయనం పరిశీలించనుంది. ఇందుకు అవసరమైన సాంకేతికతను గుర్తించి, వాటిని సైనిక అవసరాలకు అనుగుణంగా త్వరగా అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి పెట్టనుంది. ఈ ప్రాజెక్టుకు అమెరికా రక్షణ శాఖ సాంకేతిక విభాగం అధిపతి ఎమిల్ మైఖేల్ సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. విద్యా, విధాన రూపకల్పన, పరిశ్రమలకు చెందిన నిపుణులు కూడా ఇందులో భాగం కానున్నారు.

**మరో ఐదు కీలక ప్రాజెక్టులు**

ప్రాజెక్ట్ మెరిడియన్‌తో పాటు మరో ఐదు కార్యక్రమాలను హెగ్‌సెత్ ప్రకటించారు. స్వయంప్రతిపత్తితో పనిచేసే యుద్ధ వ్యవస్థల అభివృద్ధి కోసం 2027 అక్టోబరు 1 నాటికి ప్రత్యేక కమాండ్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సైనిక స్థావరాల భద్రత, దేశీయంగా కీలక విడిభాగాల తయారీని పెంచేందుకు 'ఫోర్ట్రెస్ అమెరికా' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అత్యాధునిక రక్షణ వ్యవస్థలు, స్వయం సమృద్ధితో పనిచేసే విద్యుత్ సదుపాయాలతో కొత్త సైనిక స్థావరాన్ని నిర్మించనున్నారు. ఐదు విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక సైనిక శిక్షణ కార్యక్రమాలు, సైనికులకు మతపరమైన సహకారం అందించేందుకు ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు కూడా ఈ ప్రణాళికల్లో ఉన్నాయి.

**ఎవరికి ఏ రంగంలో అనుభవం?**

ఎలాన్ మస్క్ 2002లో స్పేస్‌ఎక్స్‌ను స్థాపించారు. రాకెట్లు, అంతరిక్ష నౌకల తయారీ, ప్రయోగాల్లో ఆ సంస్థ కీలకంగా పనిచేస్తోంది. పామర్ లక్కీ అమెరికా రక్షణ సాంకేతిక సంస్థ ఆండ్యూరిల్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు. న్యూట్ గింగ్రిచ్ 1995 నుంచి 1999 వరకు అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌గా పనిచేశారు. వీరి అనుభవాన్ని భవిష్యత్తు యుద్ధాలకు అవసరమైన సాంకేతిక, వ్యూహాత్మక ప్రణాళికల రూపకల్పనలో వినియోగించుకోవాలని అమెరికా రక్షణ శాఖ భావిస్తోంది.

# 125 ఏళ్ల రికార్డు బ్రేక్..
# ఈశాన్య భారత్‌కు కనీవినీ ఎరుగని

ఈశాన్య భారతదేశం గత 125 ఏళ్లలో ఎన్నడూ లేనంత తీవ్రమైన వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో అత్యంత తక్కువ వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు వెల్లడించారు. తూర్పు, ఈశాన్య భారతదేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కేవలం 1,017.1 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. 1901లో ఐఎండీ వర్షపాత రికార్డులను ప్రారంభించినప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఇదే అత్యల్పమని అధికారులు స్పష్టం చేశారు. సాధారణంగా దేశంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో ఈశాన్య రాష్ట్రాలు ముందుంటాయి. కానీ ఈసారి అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్‌లలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. రుతుపవనాల నాలుగు నెలల్లోనూ (జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్) ఈ మూడు సబ్ డివిజన్లలో వర్షపాత లోటు కొనసాగడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయం, తాగునీరు, ఇతర ఆర్థిక కార్యకలాపాలకు పూర్తిగా నైరుతి రుతుపవనాలపైనే ఆధారపడే ఈ ప్రాంతంపై ఈ వర్షాభావం తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. సెప్టెంబర్ చివరి వారంలో అస్సాంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసినప్పటికీ, మొత్తం సీజన్‌లో ఏర్పడిన లోటును అది పూడ్చలేకపోయింది. దేశవ్యాప్తంగా చూసినా, ఈసారి రుతుపవనాల సీజన్ సాధారణం కంటే తక్కువ వర్షపాతంతోనే ముగిసింది. దేశవ్యాప్తంగా జూన్‌సెప్టెంబర్ మధ్య 759.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇది 1901 తర్వాత 13వ అత్యల్ప వర్షపాతం కాగా, 2001 తర్వాత నాలుగో అత్యల్పం. అయితే, దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఈశాన్యంలో వర్షపాత లోటు చాలా ఎక్కువగా ఉంది. వర్షాలు తగ్గడమే కాకుండా ఈశాన్యంలో సెప్టెంబర్ నెల అసాధారణంగా వెచ్చగా గడిచింది. తూర్పు, ఈశాన్య భారతదేశంలో సగటు ఉష్ణోగ్రత 27.95 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది సాధారణం కంటే 0.74 డిగ్రీలు ఎక్కువ. 1901 తర్వాత సెప్టెంబర్‌లో నమోదైన ఆరో అత్యధిక సగటు ఉష్ణోగ్రత ఇదే కావడం గమనార్హం. రాబోయే అక్టోబర్‌లో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేస్తోంది.

# త్వరలో డీఎస్సీ 2.0: మంత్రి నారా లోకేశ్

నెల రోజుల్లోపు డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి పోస్టింగ్ ఉత్తర్వుల జారీ వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. ఏపీ రిక్రూట్‌మెంట్ మోడల్‌ను దేశం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని, ఇతర రాష్ట్రాలు మన విధానాలను అనుసరించేలా సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు. పాఠశాల విద్యలో కీలక సంస్కరణలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. బడి మానేసే పిల్లల సమస్యపై సింగపూర్ హోంమంత్రి షణ్ముగం చేసిన సూచనలను ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో 'జీరో డ్రాప్ అవుట్ మిషన్' చేపట్టాలని సూచించారు. డ్రాపౌట్ల నివారణలో సమాజంలోని పెద్దలను, స్థానిక ప్రముఖులను భాగస్వాములను చేయాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఉన్నత విద్యారంగంపై కూడా సమీక్షించిన లోకేశ్, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిందని, డిసెంబరులో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో రాత పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. రాష్ట్రంలో పలు ప్రతిష్ఠాత్మక ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని, వాటికి అవసరమైన భూమిని గుర్తించాలని మంత్రి సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో విశాఖపట్నంలో పబ్లిక్ లైబ్రరీ భాగస్వామ్యంతో ఒక ప్రతిష్ఠాత్మక గ్రంథాలయాన్ని నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 125 ఆటిజం సెంటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వాణిజ్య గ్యాస్ ధర పెంపు.. పండగ సీజన్‌లో పిడుగు

దేశవ్యాప్తంగా పండగల సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో వాణిజ్య వినియోగదారులపై పెను భారం పడింది. 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు మరోసారి పెంచాయి. ఈ కొత్త ధరలు అక్టోబర్ 1వ తేదీ నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే, గృహ వినియోగదారులకు ఊరటనిస్తూ 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్‌పై రూ. 62.50 పెరిగింది. దీంతో అక్కడ సెప్టెంబర్‌లో రూ. 2,747.50గా ఉన్న ధర ఇప్పుడు రూ. 2,810కి చేరింది. ముంబైలో రూ. 63 పెంపుతో సిలిండర్ ధర రూ. 2,701 నుంచి రూ. 2,764కి పెరిగింది. చెన్నైలో రూ. 66.50 పెరగడంతో కొత్త ధర రూ. 2,983గా నమోదైంది. అలాగే హైదరాబాద్‌లో రూ. 69 పెరగడంతో రూ.3065కి చేరింది. ఇతర నగరాలతో పోలిస్తే పాట్నాలో అత్యధికంగా రూ. 71.50 మేర ధర పెరిగింది. దీంతో అక్కడ సిలిండర్ ధర రూ. 3,029 నుంచి రూ. 3,100.50కి చేరింది. లక్నోలో రూ. 62.50 పెంపుతో సిలిండర్ ధర రూ. 2,932.50కి పెరిగింది. అహ్మదాబాద్‌లో రూ. 2,831.50, కన్యాకుమారిలో రూ. 3,046, లేహ్‌లో రూ. 3,450గా కమర్షియల్ సిలిండర్ ధరలు ఉన్నాయి.

**2గృహ వినియోగదారులకు ఊరట**

ఈ ధరల పెంపు కేవలం వాణిజ్య సిలిండర్లకు మాత్రమే పరిమితం కావడం గమనార్హం. ఇళ్లలో వాడే 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధర యథాతథంగా కొనసాగుతోంది. ఢిల్లీలో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ. 942 వద్ద స్థిరంగా ఉండగా, ముంబైలో రూ. 941.50, చెన్నైలో రూ. 957.50, హైదరాబాద్‌లో రూ. 994గా ఉంది. దీంతో సామాన్య ప్రజలకు ఊరట లభించినట్లయింది. ఈ పెంపు హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సర్వీసులు, ఇతర వాణిజ్య సంస్థలపై ప్రత్యక్ష ప్రభావం చూపనుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు, డాలర్‌తో రూపాయి మారకం విలువ ఆధారంగా ప్రతి నెలా ఆయిల్ కంపెనీలు ఎల్‌పీజీ ధరలను సవరిస్తుంటాయి. పండగల సీజన్‌లో ఈ పెంపు కారణంగా బయట ఆహార పదార్థాల ధరలు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# కోట్లాది యువత ఆశల వేదిక యూపీఎస్సీ: ప్రధాని మోదీ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

# వారానికి 5 రోజుల బ్యాంకింగ్? వైరల్ వార్తపై కేంద్రం క్లారిటీ

ప్రభుత్వ రంగ బ్యాంకులకు ప్రతి శనివారం సెలవు ప్రకటించారంటూ సోషల్ మీడియాలో గెజిట్ నోటిఫికేషన్ వైరలవుతోంది. అయితే అది నకిలీదని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ స్పష్టం చేసింది. ఇలాంటి నోటిఫికేషన్‌ను ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం జారీ చేయలేదని తెలిపింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ ఈ విషయాన్ని వెల్లడించింది. ఎస్‌బీఐ సహా అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులకు కేంద్రం ప్రతి శనివారం సెలవు ప్రకటించిందని ఆ నకిలీ గెజిట్‌లో ఉంది. ప్రస్తుతం ప్రభుత్వ రంగ బ్యాంకులకు ప్రతి నెలా రెండు, నాలుగో శనివారాలు మాత్రమే సెలవులు ఉన్నాయి. మిగిలిన శనివారాల్లో బ్యాంకులు సాధారణంగా పనిచేస్తాయి. 2015లో రెండు, నాలుగో శనివారాలను ప్రభుత్వ రంగ బ్యాంకులకు సెలవులుగా ప్రకటించారు. వైరల్ అవుతున్న పత్రాలను చూసి వెంటనే నమ్మవద్దని పీఐబీ ప్రజలను కోరింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సమాచారం విషయంలో అధికారిక వర్గాల ద్వారా వివరాలు నిర్ధారించుకున్న తర్వాతే షేర్ చేయాలని సూచించింది. అనుమానాస్పద సమాచారాన్ని పీఐబీ ఫ్యాక్ట్ చెక్‌కు పంపించాలని తెలిపింది. బ్యాంకులకు ఐదు రోజుల పని వారాన్ని అమలు చేయాలన్న డిమాండ్ నేపథ్యంలో బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఇటీవల సమ్మెకు పిలుపునిచ్చాయి. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం బ్యాంకింగ్ సేవలకు అంతరాయం తగ్గించేందుకు సెప్టెంబర్ 27న ఆదివారం కూడా ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు పనిచేసేలా చర్యలు తీసుకుంది. ఆ తర్వాత చర్చలు ఫలప్రదం కావడంతో బ్యాంకులు సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాయి.

## ఫ్లైదుబాయ్ పైలట్‌కు 'గుజరాత్ గరిమా' అవార్డు

ఫ్లైదుబాయ్ విమానంలో సహ పైలట్ జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడినప్పటికీ, అసాధారణ ధైర్యసాహసాలతో 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు గుజరాత్ ప్రభుత్వం 'విశిష్ట గుజరాత్ గరిమా అవార్డు'ను ప్రకటించింది. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ స్వయంగా వెల్లడించారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. సహ పైలట్ విమానాన్ని కూల్చివేసే క్రమంలో ఆకస్మికంగా కెప్టెన్ స్మిత్‌పై గొడ్డలి (క్రాష్ యాక్స్) వంటి వస్తువుతో దాడికి పాల్పడ్డాడు.

## సంపాదకీయం

# ఆకాశమంత ధైర్యం

# జెన్ జీ స్ఫూర్తికి ప్రతీక స్మిత్ మచ్చర్

ఈ మధ్యకాలంలో 'జెన్ జీ' అనే పదం ఎక్కువగా వినిపిస్తున్నది. అయితే యువతరం మీద ఒక్కొక్కరు ఒక్కో అభిప్రాయం వెలిబుచ్చుతూ ఉంటారు. సామాజిక స్పృహ లేదని ఒకరంటే, ఇంట్లో కూడా బాధ్యతారాహిత్యంగా ఉంటున్నారు అని మరొకరు అంటూ ఉంటారు. ముఖ్యంగా కష్టం విలువ వారికి అర్థం కావటం లేదు అనే మాట ఎక్కువగా వినిపిస్తుంది. సమస్య వస్తే తట్టుకొనే శక్తి వారికి లేదు అనేది మన ప్రధానమైన ఆరోపణ. రెండు, మూడు సంవత్సరాల నుండి జెన్ జీ ఉద్యమాలు చూస్తున్నాం. నేపాల్‌లో ప్రభుత్వాన్ని మార్చగలిగే శక్తివంతమైన ఉద్యమంలో ఫలితం వచ్చినా, హింస చెలరేగటాన్ని జెన్ జీకి ఆపాదించారు. బంగ్లాదేశ్‌లో యువత ఉద్యమించినప్పుడు ఆ నిమిషానికి వచ్చిన ఆవేశంతో అల్లర్లు చేశారు కానీ, ఆ ఉద్యమానికి లక్ష్యం లేదు అన్నారు. కానీ అవి ఆ దేశాల ప్రభుత్వాలను పడగొట్టగలిగాయి. మన భారత ప్రధాన న్యాయమూర్తి యువతను ఉద్దేశించి బొద్దింకలు అన్నందుకు, "మేము బొద్దింకలమే" అంటూ అభిజిత్ దీప్కే పెట్టిన వ్యంగ్య పోస్టు 'కాక్రోచ్ జనతా పార్టీ' అనే వేదికను తయారు చేయటమే కాక దేశ యువతను మేల్కొల్పింది. ఒక్క చిన్న పోస్టుతో మొదలైన ఉద్యమం కేంద్ర ప్రభుత్వ మెడలు వంచింది. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌ల మాదిరిగా మన జెన్ జీ ఉద్యమంలో హింస చెలరేగలేదు. అయినా రామచంద్ర గుహ లాంటి వారు సాంప్రదాయ ఆందోళనలకు భిన్నంగా మీమ్స్, డిజిటల్ నిరసనల ద్వారా యువత రాజకీయాలలోకి రావటంపై విశ్లేషిస్తూ—"ఈ డిజిటల్ నిరసనలు వ్యవస్థలోని లోపాలను వేగంగా వెలుగులోకి తెచ్చినప్పటికీ, గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ వంటి వారి దీర్ఘకాలిక సిద్ధాంతపరమైన పునాది ఉంటేనే ఇవి నిజమైన మార్పుకు దారితీస్తాయి" అని వ్యాఖ్యానించారు. అయితే అవసరం మనిషిని ఆలోచింపజేస్తుంది. ఈరోజు ఆవేశంగా నడిచిన యువత, రేపు మరలా రావాల్సి ఉంటే ఎలా రావాలో ఒక ప్రణాళిక రూపొందించుకుంటుంది. ఈ వ్యాఖ్యానాలలో తప్పు లేదు కానీ, ఈ ఉద్యమాల ద్వారా మనకు అర్థమయ్యేది మాత్రం యువత మనం అనుకుంటున్నట్లు బాధ్యతారాహిత్యంగానో, సమాజ పోకడల గురించి అవగాహన లేకుండానో కాలం గడపటం లేదు. ఆందోళనలు, నిరసనలలో పాల్గొనటం ద్వారా వారు సంక్షోభ సమయాల్లో స్పందించగలరో లేదో అనే సందేహం మిగిలిపోయి ఉన్నది. సంక్షోభం వస్తే చివరివరకూ నిలబడగలరా లేదా అనే సందేహానికి మన భారతీయ పైలట్ స్మిత్ సమాధానం చెప్పాడు. ఈరోజు ప్రపంచాన్నే దిగ్భ్రాంతికి గురిచేసిన ఫ్లైదుబాయ్ విమానంలో సహచరుడు కావించ తలపెట్టిన ఉన్మాదం నుండి ప్రయాణికులను కాపాడిన తీరు భారత యువశక్తికి ప్రతీకగా నిలిచింది. భూమికి 34,000 అడుగుల ఎత్తులో ఉండగా కో-పైలట్ తనపై కత్తితో దాడిచేసినా, విమానం కంట్రోల్ ఆ ఉన్మాది చేజిక్కకుండా స్మిత్ మచ్చర్ పోరాడిన తీరు అనన్యసామాన్యం. కత్తిపోట్ల వలన తీవ్రంగా రక్తం ఓడుతున్నప్పటికీ కెప్టెన్ స్మిత్ మ్యాచర్ అత్యంత సమయస్ఫూర్తితో కో-పైలట్‌ను నిరోధించారు. ఒకవైపు కో-పైలట్‌ను నిరోధిస్తూనే, మరోవైపు కాక్‌పిట్ డోర్ అన్‌లాక్ చేసి లోపలికి తోటి విమాన సిబ్బంది, ప్రయాణికులు రావటానికి మార్గం సుగమం చేశారు. ఇవన్నీ వారికి ట్రైనింగ్‌లో నేర్పేవే అయినా, ఆపద సమయంలో, అందునా కత్తిపోట్లతో గాయాలపాలైన సమయంలో కూడా చివరి నిమిషం వరకూ ప్రయాణికులను కాపాడేందుకు స్మిత్ మచ్చర్ పోరాడిన తీరు భారత జాతికే గర్వకారణం. అతగాడు సైనికుడు కాదు, కానీ వీరోచితంగా పోరాడాడు. జీవితాన్ని కాచి వడపోసినవాడు కాదు, కానీ 180 మంది ప్రాణాల కోసం తెగించి కత్తికి ఎదురుగా నిలబడ్డాడు. అన్నిటికంటే మించి ధైర్యం కోల్పోకపోవటం ఆశ్చర్యం కలిగించింది. గతంలో ఇలాంటి సంఘటనలు జరిగిన సందర్భాలలో ఒకే ఒక్క సందర్భంలో మాత్రమే పైలట్లు ప్రాణనష్టాన్ని నివారించగలిగారు. అది కూడా ఒక కార్గో విమానంలో—అందులో ఉన్న ఫ్లైట్ ఇంజనీర్ కాక్‌పిట్‌లోకి వెళ్లి ముగ్గురు పైలట్లపై హ్యామర్లు, స్పియర్ గన్లతో దాడి చేశాడు. పైలట్లు ముగ్గురూ కలిసి అతడిని లొంగదీసుకున్నారు. అక్కడ ముగ్గురు పైలట్లు ఉన్నారు, గాయపరచిన వ్యక్తి పైలట్ కూడా కాదు; అందుకని విమానం వారి కంట్రోల్‌లోనే ఉన్నది. 2015 లో స్పెయిన్ నుండి జర్మనీ వెళ్తున్న విమానంలో పైలట్ వాష్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో, కో-పైలట్ లోపల డోర్ లాక్ చేసుకుని విమానాన్ని ఫ్రాన్స్‌లోని ఆల్ప్స్ పర్వతాల్లోకి తీసుకెళ్లి కూల్చివేశాడు. ఆ దుర్ఘటనలో 150 మంది మరణించారు. ఆ సంఘటన తరువాతే కాక్‌పిట్‌లో ఎప్పుడూ ఇద్దరు వ్యక్తులు ఉండాలనే నిబంధనను ప్రపంచవ్యాప్తంగా కఠినతరం చేశారు. మరో సంఘటనలో ఇండోనేషియా నుండి సింగపూర్ వెళ్తున్న విమానంలో కో-పైలట్ బయటకు వెళ్లిన సమయంలో కెప్టెన్ కాక్‌పిట్‌ను లాక్ చేసి, ఫ్లైట్ డేటా రికార్డర్లను డిస్కనెక్ట్ చేసి విమానాన్ని నదిలో కూల్చివేశాడు; 104 మంది ప్రయాణికులు మరణించారు. న్యూయార్క్ నుండి కైరో వెళ్తున్న విమానంలో కూడా కెప్టెన్ కాక్‌పిట్ వదిలి వెళ్లగానే కో-పైలట్ ఆటోపైలట్‌ను ఆపివేసి విమానాన్ని అట్లాంటిక్ మహాసముద్రంలోకి మళ్లించాడు. కెప్టెన్ లోపలికి వచ్చి విమానాన్ని నియంత్రించే ప్రయత్నం చేసినప్పటికీ సాధ్యపడలేదు; 217 మంది ప్రయాణికులు మరణించారు. మొజాంబిక్‌లో జరిగిన ఇలాంటి ప్రమాదంలోనే 33 మంది ప్రయాణికులు మరణించారు. ఒకసారి విమానం గాల్లో ఉన్న సందర్భాలలో పైలట్లు ఉన్మాదానికి, డిప్రెషన్‌కు గురయ్యారంటే ప్రయాణికుల ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయిన సందర్భాలే కనిపిస్తున్నాయి. ఫ్లైదుబాయ్‌లో కూడా ప్రయాణికుల పరిస్థితి అలాగే ఉండేదేమో! స్మిత్ మచ్చర్ కాక్‌పిట్‌ను అన్‌లాక్ చేయటమే ప్రయాణికులను కాపాడింది. మరణాలు సంభవించిన విమానాలలో కూడా పైలట్లు తమ సర్వశక్తులూ ఒడ్డారు, కానీ కాపాడలేకపోయారు. స్మిత్ మచ్చర్ కూడా కో-పైలట్‌ను లొంగదీసుకునే ప్రయత్నం ఒక్కటే చేసి ఉంటే ప్రమాదాన్ని నివారించే అవకాశం తక్కువగా ఉండేది. సమయానుకూలంగా తీసుకున్న నిర్ణయమే తనను, ప్రయాణికులను కాపాడింది. ఏది ఏమైనా మన దేశ యువత సంక్షోభం వస్తే బెదిరిపోకుండా ఒక సముచిత నిర్ణయం తీసుకోగలిగే స్థితిలోనే ఉంటారు అనే ధైర్యాన్ని కలుగజేశాడు మన పైలట్ స్మిత్ మచ్చర్. స్మిత్‌కు సౌదీలో శస్త్రచికిత్స చేశారనే వార్తలు వచ్చాయి; మన హీరో త్వరగా కోలుకోవాలని కోరుకుందాం. మన జెన్ జీ ఇలాగే ఉండాలి, అలాగే ఉండాలి అని మనం కోరుకోవటం ఒక్కటే కాదు; వారు ఎలా ఉంటున్నారో గమనించాలి. కింద పడతారు, దెబ్బలు తగులుతాయి; గాయాలు తగ్గాక మళ్లీ లేచి నిలబడతారు, నడుస్తారు. ఈసారి మరికొంచెం జాగ్రత్తగా నడిచే ప్రయత్నం చేస్తారు. అభిజిత్ దీప్కే లాంటి వారిని గాంధీ, నెహ్రూల మాదిరిగానో, అంబేద్కర్ మాదిరిగానో ఉండాలని మనం కోరుకోకూడదు. మార్గ్సజానికే తమకవసరమైన అద్దకాలు చేస్తున్నారు. కాలం మారినట్లే సమస్యల స్వరూపం కూడా మారుతుంది. దానికి అనుగుణంగా మన యువత నడిచే దారిలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవటంలో మన మార్గదర్శకత్వం అవసరమైనంతవరకు ఇవ్వవచ్చు కానీ, వారిని అంబాడే దశలోనే నడిపించే ప్రయత్నం చేయకూడదు. 34,000 అడుగుల ఎత్తులో గాలిలో విమానం పల్టీలు కొడుతున్నప్పుడు ఒక యువకుడు తన తోటి ఉద్యోగి చేతిలోని కత్తిని లాక్కుని అతడిని కత్తితో పొడిచి గాయం చేసో, చంపేసో విమానాన్ని కాపాడాలి అనే ఆప్షన్‌లోకి వెళ్లకుండా, కాక్‌పిట్ తలుపు తెరవాలనే ఆప్షన్ ఎంచుకున్నాడు; విజయం సాధించాడు. గాంధీ గారి అహింస ఒక్కటే ఈ దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించలేదు; భగత్ సింగ్ వంటి విప్లవ వీరుల త్యాగాల ఫలితం కూడా ఉన్నది. మన యువతపైన విశ్వాసాన్ని ఉంచుదాం. హింసకు అర్థం మారిపోయిన ఈ రోజుల్లో కనిపించని హింసను అమలు చేసేవారిని కట్టడి చేయగలిగే శక్తి మన యువతకు ఉన్నది అని విశ్వసించటం ఒక్కటే మన బాధ్యత. మరొక్కసారి మన యువకిశోరం స్మిత్ మచ్చర్ కు జేజేలు పలుకుదాం!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు

### అక్టోబర్ 02

OCTOBER 2

* అంతర్జాతీయ సత్యాగ్రహ దినోత్సవం
* అంతర్జాతీయ అహింసా దినం, గాంధీ జయంతి.
* 1869: గుజరాత్ లోని పోర్‌బందర్ లో మహాత్మా గాంధీ జన్మించాడు (మ.1948). (చిత్రంలో)
* 1904: భారతదేశ స్వాతంత్ర్యసమరయోధుడు, రెండవ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జననం (మ.1966).(చిత్రంలో)
* 1928: సాహితీవేత్త, బహుముఖ కళా శిల్పి ఎస్.వి.జోగారావు జననం (మ.1992).
* 1966: భారతదేశంలోని 16 రైల్వే జోన్‌లలో ఒకటైన దక్షిణ మధ్య రైల్వే ప్రారంభం.



మహాత్మా గాంధీ

* 1975: తమిళనాడుకు చెందిన భారత రాజకీయనాయకుడు, భారత రత్న పురస్కార గ్రహీత కె.కామరాజ్ మరణం (జ.1903).
* 2006: డా. జయప్రకాశ్ నారాయణ్ చే లోక్ సత్తా పార్టీ స్థాపించబడినది.

### అరకును గ్లోబల్ కాఫీ డెస్టినేషన్‌గా

# తీర్చిదిద్దుతాం: సీఎం చంద్రబాబు

* అరకును గ్లోబల్ కాఫీ డెస్టినేషన్‌గా మార్చేందుకు పెట్టుబడులు
* ప్రపంచ కాఫీ పటంలో ఏపీకి సరైన స్థానం కల్పిస్తామన్న చంద్రబాబు
* గిరిజనుల శ్రమ, తూర్పు కనుమల సౌరభం అరకు కాఫీ అన్న పవన్ కల్యాణ్
* అరకు కాఫీని ప్రధాని మోదీ కూడా ప్రశంసించారని గుర్తు చేసిన పవన్
* అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన నేతలు



అరకును ప్రపంచ స్థాయి కాఫీ కేంద్రంగా (ప్రీమియర్ గ్లోబల్ కాఫీ డెస్టినేషన్) తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రియాశీలకంగా పెట్టుబడులు పెడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉదయం ఒక కప్పు కాఫీ తాగనిదే కోట్లాది మందికి రోజు ప్రారంభం కాదని, తన దినచర్య కూడా అరకు కాఫీతోనే మొదలవుతుందని చంద్రబాబు 'ఎక్స్' వేదికగా తెలిపారు. "అరకు.. ఆంధ్రప్రదేశ్ ఘనమైన వారసత్వ సంపదకు ప్రతీక. మన రాష్ట్రంలోని కొండ ప్రాంతాల నుంచి ప్రపంచవ్యాప్తంగా కాఫీ కప్పుల వరకు అరకు కాఫీ సాగించిన అద్భుత ప్రయాణాన్ని ఈ అంతర్జాతీయ కాఫీ దినోత్సవం రోజున జరుపుకుందాం" అని ఆయన పేర్కొన్నారు. స్థానిక రైతులను ప్రోత్సహిస్తూ, ప్రపంచ కాఫీ పటంలో ఆంధ్రప్రదేశ్‌కు సరైన స్థానం కల్పించడమే తమ లక్ష్యమని చంద్రబాబు వివరించారు. ఇదే సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అంతర్జాతీయ కాఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అరకు కాఫీ విశిష్టతను వివరిస్తూ, "ప్రతి కప్పు అరకు కాఫీలో తూర్పు కనుమల సౌరభం, అక్కడి నేల సారం, మన గిరిజన రైతుల కఠోర శ్రమ ఇమిడి ఉన్నాయి" అని అన్నారు. అరకు కాఫీ కేవలం రుచి, సువాసనలకు మాత్రమే పరిమితం కాదని, అది మన అడవులు, గిరిజన సంఘాలు, వారి సంప్రదాయ జ్ఞానం మధ్య ఉన్న బంధానికి ప్రతీక అని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్న ఈ స్థానిక ఉత్పత్తి, అరకు లోయల నుంచి ఢిల్లీలోని పార్లమెంట్ వరకు ప్రయాణించిందని, అక్కడ ప్రత్యేక స్టాళ్ల ద్వారా ప్రదర్శించబడిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా అరకు కాఫీని, దాని సాగుతో ముడిపడి ఉన్న గిరిజన కుటుంబాల కృషిని పలుమార్లు ప్రశంసించారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "ఒక కప్పు అరకు కాఫీ అంటే మన నేల రుచి, మన ప్రజల కథ, మన తూర్పు కనుమల సువాసన" అని పవన్ కల్యాణ్ అభివర్ణించారు. మొత్తంగా, అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర నాయకత్వం అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటించింది.



# పరిశుభ్రత పై ప్రజల్లో అవగాహన పెరగాలి

- సీజీహెచ్‌ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్లు నాగార్జున, రమేష్

పరిసరాల పరిశుభ్రత పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గుంటూరు సీజీహెచ్‌ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం) వెల్ నెస్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంపాలెం లోని సీజీహెచ్‌ఎస్ కార్యాలయ పరిసరాలను సీజీహెచ్‌ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్లు కొండా నాగార్జున, దాసరి రమేష్ మరియు సిబ్బంది స్వచ్ఛందంగా శ్రమదానం చేసారు. పేరుకు పోయిన చెత్తను సైతం తొలగించి, పరిశుభ్రంగా చేసారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు పరిశుభ్రమైన పరిసరాలు ఎంతో అవసరమని, బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ ఆఫీసర్లు సూచించారు. స్వచ్ఛత కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములై పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు కోరారు. తొలుత సీజీహెచ్‌ఎస్ కార్యాలయ వెలుపల డాక్టర్లు, సిబ్బంది స్వచ్ఛత శపథం చేసారు. ఈ కార్యక్రమంలో సీజీహెచ్‌ఎస్ చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ హేమ సుందరి, ఫార్మాసిస్టులు కౌసల్య, సునీల్ వైద్య సిబ్బంది మురళీ, పేరేశ్వరరావు, రామారావు, మక్బుల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# తక్కువ ఖర్చు, వేగవంతమైన నిర్మాణం.. బుర్రిపాలెంలో 3D ఇళ్లు

- **ఏపీలో 3D కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణం**
- **పైలట్ ప్రాజెక్ట్‌గా బుర్రిపాలెం గ్రామంలో 100 గృహాల నిర్మాణం**
- **అక్టోబర్ 4న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని చేతుల మీదుగా ప్రారంభం**
- **తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో నిర్మాణం పూర్తి చేయడం దీని ప్రత్యేకత**
- **సీబీఆర్ఐ సాంకేతిక సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం**

ఏపీలో గృహ నిర్మాణ రంగంలో ప్రభుత్వం ఒక వినూత్న ముందడుగు వేస్తోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ (పీఎంఏవైజీ) పథకం కింద తొలిసారిగా 3D కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీని ఉపయోగించి ఇళ్లను నిర్మించేందుకు సిద్ధమైంది. పైలట్ ప్రాజెక్ట్‌గా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామంలో ప్రయోగాత్మకంగా సుమారు 100 ఇళ్లను నిర్మించనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని అక్టోబర్ 4న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సంయుక్తంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టును కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీబీఆర్ఐ) భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ రంగంలో గృహ నిర్మాణం కోసం ఈ టెక్నాలజీని ఉపయోగించడం ఇదే మొదటిసారి.

ఈ విధానంలో ముందుగా పునాదులు పూర్తి చేసిన తర్వాత, ప్రత్యేకమైన 3D ప్రింటింగ్ యంత్రాలతో గోడలను నిర్మిస్తారు. డిజిటల్‌గా రూపొందించిన డిజైన్ల ఆధారంగా ఈ యంత్రాలు కాంక్రీట్ మిశ్రమంతో పొరలు పొరలుగా గోడలను ప్రింట్ చేస్తాయి. గోడల నిర్మాణానికి ఫ్లైయాష్ ఇటుకలను కూడా ఉపయోగించనున్నారు. ఈ ప్రక్రియకు అవసరమైన 3D ప్రింటర్‌ను ఒక ప్రైవేట్ సంస్థ నుంచి సేకరించనుండగా, సీబీఆర్ఐ సాంకేతిక సహకారాన్ని అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఇంటిని సుమారు 325 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. ఈ టెక్నాలజీ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే, ఒక పడకగది ఇంటిని కేవలం 45 నుంచి 60 రోజుల్లోనే



పూర్తి చేయవచ్చని అంచనా. దీనివల్ల నిర్మాణ సమయం గణనీయంగా తగ్గడమే కాకుండా, తక్కువ సంఖ్యలో కార్మికులు అవసరమవుతారు. ఫలితంగా నిర్మాణ వ్యయం, ముడిసరుకు వృథా కూడా తగ్గుతుంది. అంతేకాకుండా, ఈ గోడలకు మెరుగైన థర్మల్ ఇన్సులేషన్ ఉండటం వల్ల ఇళ్ల లోపల వాతావరణం చల్లగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ నూతన టెక్నాలజీని ప్రోత్సహించేందుకు, పీఎంఏవైజీ పథకం కింద అందించే ప్రామాణిక ఆర్థిక సహాయానికి అదనంగా మరికొంత సాయం అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పీఎంఏవైజీ కింద సుమారు మూడు లక్షల ఇళ్లను మంజూరు చేసింది. బుర్రిపాలెంలో ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా పేదల ఇళ్ల నిర్మాణంలో ఈ టెక్నాలజీని విస్తృతంగా వినియోగించే అవకాశం ఉంది. ఇది గృహ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయడమే కాకుండా, నాణ్యతను కూడా పెంచుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## యూట్యూబర్ రావణ్‌కు షాక్ దర్యాప్తు గడువు మరో 30 రోజుల పొడిగింపు

- **రావణ్‌పై నమోదైన ఉపా కేసులో దర్యాప్తు గడువు పొడిగింపు**
- **విచారణకు మరో 30 రోజులు అనుమతించిన కృష్ణా జిల్లా కోర్టు**
- **లోతైన దర్యాప్తునకు సమయం కావాలని కోరిన అధికారులు**

యూట్యూబర్ రావణ్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద నమోదైన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు గడువును మరో 30 రోజుల పాటు పొడిగిస్తూ కృష్ణా జిల్లా కోర్టు ఈరోజు కీలక ఉత్తర్వులు జారీ



చేసింది. వివరాల్లోకి వెళితే, ప్రశ్న రావణ్‌పై నమోదైన ఉపా కేసులో చట్ట ప్రకారం నిర్దేశించిన 90 రోజుల దర్యాప్తు గడువు రేపటితో (అక్టోబర్ 2) ముగియనుంది. ఈ నేపథ్యంలో, కేసులో మరింత లోతైన విచారణ జరిపి, కీలక ఆధారాలు సేకరించేందుకు అదనపు సమయం అవసరమని దర్యాప్తు అధికారులు భావించారు. ఈ మేరకు గడువును పొడిగించాలని కోరుతూ కృష్ణా జిల్లా కోర్టులో ప్రత్యేక పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం, దర్యాప్తు అధికారుల విజ్ఞప్తిని అంగీకరించింది. విచారణ పూర్తి చేయడానికి మరో 30 రోజుల గడువు ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. రావణ్ మావోయిస్టు భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాడని, సాయుధ విప్లవానికి మద్దతు ఇస్తున్నాడని జనసేన నేత ఒకరు చేసిన ఫిర్యాదు మేరకు జూలై నెలలో పోలీసులు రావణ్‌ను అరెస్టు చేసి ఉపా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తాజా ఉత్తర్వులతో దర్యాప్తు అధికారులు విచారణను కొనసాగించి, తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

## తల్లి వర్ధంతి.. బాలకృష్ణ ఎమోషనల్ పోస్ట్



- **తల్లి బసవతారకం వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన బాలకృష్ణ**
- **అమ్మ చూపిన మార్గమే తన జీవితానికి శక్తి అని వెల్లడి**
- **బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రూపంలో ఆమె సంకల్పం నిలిచిందన్న బాలయ్య**
- **పేదలకు ఆసుపత్రి అందిస్తున్న సేవలే అమ్మకు నిజమైన నివాళి అని పేర్కొనడం**
- **భావోద్వేగపూరిత పోస్ట్ ద్వారా తన మనసులోని మాట పంచుకున్న బాలకృష్ణ**

"మా అమ్మ శ్రీమతి బసవతారకం గారి వర్ధంతి సందర్భంగా నా హృదయపూర్వక నివాళులు. అమ్మ భౌతికంగా మా మధ్య లేకపోయినా.. ఆమె ప్రేమ, ఆమె ఆశీస్సులు, ఆమె చూపిన మార్గం ఎప్పటికీ మా జీవితాల్లో సజీవంగానే ఉంటాయి. ఆమె చూపిన అపారమైన మమకారం, ఆమె పోరాటం వెనుక నిలిచిన అసాధారణ ధైర్యం, ఆమె మాకు నేర్పిన విలువలు.. నేటికీ నా జీవితాన్ని నడిపించే శక్తిగా నిలిచాయి. ఆమె జ్ఞాపకాలను కేవలం మనసులో దాచుకోవడం మాత్రమే కాదు.. ప్రతి పేదవాడికీ, ప్రతి రోగికీ ఆశాకిరణంగా నిలుస్తున్న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రూపంలో ఆమె పేరు, ఆమె సంకల్పం చిరస్థాయిగా నిలవడం, ఆమె సేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడం నాకు ఎంతో గర్వకారణం. ఎందరో జీవితాల్లో ఆశను నింపుతున్న ఈ సేవా ప్రయాణం ఆమె ఆశయాలకు నిజమైన నివాళిగా నిరంతరం కొనసాగాలని కోరుకుంటున్నాను. అమ్మ చల్లని ఆశీస్సులు ఎల్లప్పుడూ మా అందరిపై ఉండాలని ప్రార్థిస్తున్నాను" అంటూ బాలకృష్ణ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

## ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు.. 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!

- **స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించే జీవోల రద్దు**
- **మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని హైకోర్టు స్పష్టీకరణ**
- **ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశం**
- **వార్డుల పునర్విభజన, ఇతర అంశాలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం**

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర



ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది. అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది. మొత్తం మీద ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. కేవలం రిజర్వేషన్ల శాతాన్ని మాత్రమే సమీక్షించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో స్థానిక పోరుకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళుతుంది? కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి కొత్త ఫార్ములాను ఎలా రూపొందిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెరిగింది.

## కూతురు పొలిటికల్ ఎంట్రీ ప్రచారంపై మంత్రి నారాయణ క్లారిటీ

- **తన కూతురు షరణి మేయర్‌గా పోటీ చేయదని నారాయణ స్పష్టీకరణ**
- **తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని వెల్లడి**
- **ప్రజా సేవ చేయడానికే తాను రాజకీయాల్లోకి వచ్చానన్న మంత్రి**



తన కుమార్తె షరణి రాజకీయ ప్రవేశంపై వస్తున్న వదంతులకు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ తెరదించారు. తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని, తన కుమార్తె మేయర్‌గా పోటీ చేస్తారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ, ఈ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేశారు. తనపై ఎన్ని ఆరోపణలు వచ్చినా తాను పట్టించుకోనని మంత్రి నారాయణ అన్నారు. "కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది" అంటూ తనపై విమర్శలు చేస్తున్న వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాను ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని తెలిపారు. అంతకుముందు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి నారాయణ వివరించారు. గత రెండేళ్లలో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో వేలాది మందికి శాశ్వత నివాస ధ్రువీకరణ పట్టాలు అందించామని చెప్పారు. నెల్లూరులో ఇప్పటికే 1,450 మందికి పట్టాలు ఇచ్చామని, త్వరలోనే మరో 1,250 మందికి అందిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## కెప్టెన్ స్మిత్ ధైర్యానికి సెల్యూట్.. ఆకాశంలో అసలైన హీరో: పవన్ కల్యాణ్

- **విమానంలో సహ పైలట్ దాడిని ఎదుర్కొన్న కెప్టెన్ స్మిత్**
- **క్షతగాత్రుడైనా 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన వైనం**
- **స్మిత్‌ను ఆకాశంలో రియల్ హీరోగా అభివర్ణించిన పవన్ కల్యాణ్**

ఆకాశంలో అసలైన హీరో కెప్టెన్ స్మిత్ మచ్చర్ అంటూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశంసించారు. ఫ్లైదుబాయ్ విమానంలో సహ పైలట్ దాడిని ఎదుర్కొని, 174 మంది ప్రాణాలను కాపాడిన ఆయన ధైర్యాన్ని ఇరువురు నేతలు కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం స్మిత్ సాహసాన్ని అభినందించారు.

**అసలేం జరిగిందంటే..!**

దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానం FZ1073 గాల్లో ఉండగా ఈ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. విమానం కాక్‌పిట్‌లో ఉన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై, ఆయన సహ పైలట్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. విమానాన్ని తన నియంత్రణలోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడినప్పటికీ, కెప్టెన్ స్మిత్ అసాధారణ ధైర్యం ప్రదర్శించారు. దుండగుడితో పోరాడి, కాక్‌పిట్ డోర్‌ను తెరవగలిగారు. దీంతో వెంటనే అప్రమత్తమైన విమాన సిబ్బంది, ప్రయాణికులు కలిసి దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కెప్టెన్ స్మిత్ సమయస్ఫూర్తి వల్ల పెను ప్రమాదం తప్పి, విమానంలోని 174 మంది సురక్షితంగా బయటపడ్డారు.

**పవన్ కల్యాణ్ ప్రశంసలు**

ఈ ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయం 'ఎక్స్' వేదికగా స్పందించింది. "విమానంలో సంక్షోభ సమయంలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ చూపిన అసాధారణ ధైర్యానికి, సమయస్ఫూర్తికి హృదయపూర్వక అభినందనలు. తీవ్రంగా గాయపడినా, దాడిని ఎదుర్కొని కాక్‌పిట్ డోర్ తెరిచి, పెను విషాదాన్ని నివారించారు. ప్రతి సెకను కీలకమైన సమయంలో, 174 మంది ప్రాణాలకు, ప్రమాదానికి మధ్య ఆయన నిలిచారు. ఆయన అసలైన హీరో, గర్వించదగ్గ భారతీయుడు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని జనసేన నేత పవన్ కల్యాణ్ తన పోస్టులో పేర్కొన్నారు.

**కొనియాడిన జగన్, కిషన్ రెడ్డి**

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ సైతం కెప్టెన్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడారు. "ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడటంలో స్మిత్ మచ్చర్ చూపిన అసామాన్య ధైర్యానికి హ్యాట్సాఫ్.



తీవ్రంగా గాయపడినా ప్రయాణికుల భద్రత పట్ల తన నిబద్ధతను వీడలేదు. ధైర్యం, నిస్వార్థ సేవకు ప్రపంచానికి అర్థం చూపిన గర్వించదగ్గ భారతీయుడు. ఆయన త్వరగా కోలుకోవాలి" అని జగన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కూడా కెప్టెన్ స్మిత్‌పై ప్రశంసలు కురిపించారు. "తీవ్రమైన ప్రమాదం ఎదురైనప్పటికీ కెప్టెన్ స్మిత్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. ఆయన మొక్కవోని సంకల్పం, నిస్వార్థ నిబద్ధత వందలాది మంది ప్రాణాలను కాపాడాయి. స్మిత్‌ను చూసి భారతదేశం గర్విస్తోంది. ఆయన త్వరగా కోలుకోవాలి" అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా నేతలంతా ఓ హీరోను అభినందించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## లోకేశ్‌పై రాజ్‌దీప్ సర్దేశాయ్ ప్రశంసలు.. ఇతర నేతలు ఆదర్శంగా తీసుకోవాలని సూచన

కొచ్చిలో జరిగిన ఇండియా టుడే సౌత్ కాంక్లేవ్‌లో రాజ్‌దీప్ సర్దేశాయ్.. మంత్రి లోకేశ్‌ను ముఖాముఖి ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ఏపీ అభివృద్ధి, జాతీయ రాజకీయాలు, ఇతర అంశాలపై పలు ప్రశ్నలు సంధించారు. ఇంటర్వ్యూ చివరలో రాజ్‌దీప్ మాట్లాడుతూ... మీరు అడగబోయే ప్రశ్నల జాబితా ముందే ఇవ్వండి అని అడగని నాయకులను ఇంటర్వ్యూ చేయడం ఎప్పుడూ సులభంగా ఉంటుందని అన్నారు. ఈ ఇంటర్వ్యూపై లోకేశ్ సోషల్ మీడియా వేదికగా నిన్న స్పందించారు. ఈ చర్చలో దేశం గురించి, రాష్ట్రం గురించి, పాలన గురించి, భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడినట్టు వెల్లడించారు. ఎలాంటి స్క్రిప్ట్ అవసరం లేకుండానే రాజ్‌దీప్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని తెలిపారు. అందుకు రాజ్ దీప్ నేడు సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలపై



గతంలో నాయకులందరూ ఇలాగే ఉండేవారని, కానీ ఇప్పుడు అది చాలా అరుదుగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఇతర నేతలు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుంటారని భావిస్తున్నాను అంటూ రాజ్‌దీప్ మంత్రి లోకేశ్‌కు కితాబిచ్చారు.

## ఏపీలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు

అమరావతి: రాష్ట్రంలో 807 మద్యం దుకాణాలకు కొత్తగా లైసెన్సుల జారీ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం మరో మూడు రోజులు పొడిగించింది. దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న వారికి అదనపు అవకాశం కల్పిస్తూ అక్టోబర్ 6 అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అనంతరం అక్టోబర్ 7న దరఖాస్తుల పరిశీలన చేపట్టి, అర్హత కలిగిన దుకాణాలకు అక్టోబర్ 8న డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహించి లైసెన్సులు కేటాయించనున్నట్లు అబ్కారీ, మద్య నిషేధ శాఖ కమిషనర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తాజా కేటాయింపుల కోసం గుర్తించిన 807 ఏ4 దుకాణాల్లో 799 ఓపెన్ కేటగిరీ, 8 రిజర్వ్‌డ్ కేటగిరీ దుకాణాలు ఉన్నాయి. పునరుద్ధరణ జరగని.. ప్రస్తుతం పనిచేయని దుకాణాల స్థానంలో ఈ తాజా కేటాయింపులు చేపడుతున్నారు. ఒక దుకాణానికి నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానంలో దరఖాస్తులు సమర్పించొచ్చు. రూ.3 లక్షలు నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుము చెల్లించాలి. ఓపెన్ కేటగిరిలోని దుకాణాల కోసం https://oc.hpfsproject.com పోర్టల్‌లో, కల్లు గీత కార్మికులకు రిజర్వు చేసిన దుకాణాల కోసం https://gk.hpfsproject.com పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

# బీఆర్‌ఎస్‌తో పొత్తు, ఖైరతాబాద్‌లో బీజేపీ పోటీపై కిషన్ రెడ్డి ఏమన్నారంటే?

- **బీఆర్‌ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేసిన కిషన్ రెడ్డి**
- **ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఈసీపై దాడి చేస్తోందని ఆరోపణ**
- **హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు**
- **కాంగ్రెస్ దొంగ ఓట్లను చేర్పించే ప్రయత్నం చేస్తోందని విమర్శ**

ఖైరతాబాద్ లో బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నాయకుడు జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ పొత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామని, అయితే ఈసారి బీజేపీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్



ప్లాంట్‌కు బొగ్గు కేటాయింపులపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, సింగరేణి బొగ్గును వినియోగించుకునేలా ఈ ప్లాంట్‌కు ఎందుకు రూపకల్పన చేయలేదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని కిషన్ రెడ్డి తీవ్రంగా ఎండగట్టారు. రాహుల్ గాంధీ రాజ్యాంగబద్ధమైన సంస్థలపై, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌పై అనుచిత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మార్పు అనేది ప్రజల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందే తప్ప, రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. శివుడు, రాముడిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని, వాటిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘంపై, బీజేపీపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతాల వారీగా ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని, తొలగించిన ఓట్లను (మరణించిన వారు, అక్రమ చొరబాటుదారులు) తిరిగి ఓటర్ల జాబితాలో చేర్పించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుపు తథ్యమని, తమ పార్టీ ఓట్లను దొంగిలించదని, కేవలం ప్రజల హృదయాలను గెలుచుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## కోనసీమకు రైల్వే లైన్ అనుసంధానంలో కీలక ముందడుగు

అమరావతి: కోనసీమకు రైల్వేలైన్ అనుసంధానంలో కీలక ముందడుగుపడింది. కోటిపల్లినర్సాపూర్ రైల్వే లైన్ పనులు వేగవంతం చేసేందుకు రాష్ట్ర వాటా కింద అదనంగా కూటమి ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసింది. భూసేకరణ, సివిల్ వర్క్ ఖర్చులతో సహా ప్రాజెక్టు మొత్తం వ్యయంలో 25 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. ఈమేరకు రవాణాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల వినియోగంపై అంబేద్కర్



కోనసీమ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటికే భూసేకరణ కోసం చేసిన ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వ వాటాగానే రైల్వేశాఖ పరిగణనలోకి తీసుకోనుంది. రాష్ట్ర వాటా నిధుల కోసం వేచి చూస్తూ.. పనులు నిలిపివేయకుండా చూడాలని గతంలోనే కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే ఈ ప్రాజెక్టు పనులు చేపట్టాలని గతంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం చంద్రబాబు లేఖ రాశారు.

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?: సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!

- **రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ సవాల్**
- **రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు డిమాండ్**
- **సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరిన కేటీఆర్**
- **తప్పు తేలితే శిక్షకు సిద్ధమన్న కేటీఆర్**
- **ప్రభుత్వ హామీలపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్**

తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు.



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

## బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థుల డైట్ ఛార్జీలు పెంపు

అమరావతి: బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థుల డైట్ ఛార్జీలు(Diet charges) పెంచుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన ఛార్జీలు నేటి నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. 36వ తరగతి విద్యార్థుల డైట్ ఛార్జీలు రూ.1150 నుంచి 1265కు పెంచారు. 710వ తరగతి విద్యార్థులకు రూ.1400 నుంచి రూ.1600, ఇంటర్, ఆపై తరగతి విద్యార్థులకు రూ.1600 నుంచి రూ.1800కు పెంచారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నూతన మెనూ అమలు చేయనున్నారు. వారంలో ఆరు



రోజులు గుడ్లు, మూడు రోజులు చికెన్.. రోజూ పాలు, పండ్లు ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్థులకు డైట్ ఛార్జీల పెంపుపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

## ఎర్రవల్లి భూ సర్వే నివేదిక రెడీ.. ప్రభుత్వానికి నేడు సమర్పణ

- **325 సర్వే నంబర్‌లో 388 ఎకరాల పరిశీలన**
- **244 మంది అనుభవదారులకు నోటీసులు**
- **వెలికట్టలో 118 మందికి నోటీసులు**
- **వెంకటాపూర్ రైతుల నుంచి అభ్యంతరాలు**
- **నివేదికపై ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ**



మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి భూముల సర్వే నివేదిక సిద్ధమైంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు చేపట్టిన సర్వేకు సంబంధించిన పూర్తి నివేదికను అధికారులు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతికి అందజేశారు. ఈ నివేదికను కలెక్టర్ నేడు ప్రభుత్వానికి సమర్పించనున్నారు. నివేదికలో ఏ అంశాలను పొందుపరిచారు? భూములపై ఎలాంటి వివరాలు వెల్లడవుతాయి? అన్నదానిపై ఆసక్తి నెలకొంది. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో 388 ఎకరాలు, వెలికట్టలోని సర్వే నంబర్ 271లో అధికారులు సర్వే నిర్వహించారు. ఎర్రవల్లిలో 244 మంది అనుభవదారులకు, వెలికట్టలో 118 మందికి నోటీసులు ఇచ్చారు. అనంతరం ఆయా భూముల్లో క్షేత్రస్థాయిలో హద్దులు, కబ్జాపై ఉన్నవారి వివరాలను పరిశీలించారు. ఎర్రవల్లిలో ఎనిమిది రోజుల పాటు, వెలికట్టలో ఐదు రోజుల పాటు సర్వే కొనసాగింది. ఈ భూముల విషయంలో శివారు వెంకటాపూర్ గ్రామస్థులు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన భూములు ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో కలిసిపోయాయని వారు చెబుతున్నారు. ఇటీవల వెంకటాపూర్ రైతులు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. పాత రికార్డుల ఆధారంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని కోరారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు సర్వే నంబర్ 325లో భూములు సాగు చేసుకుంటున్న రైతుల్లోనూ ఆందోళన ఉంది. దశాబ్దాలుగా తమ అధీనంలో ఉన్న భూముల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వారు ఎదురుచూస్తున్నారు. సర్వే సందర్భంగా రైతులు తమ వద్ద ఉన్న పట్టా పాస్‌బుక్కులు, ఇతర పత్రాలను అధికారులకు చూపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మర్కూక్ మండల పరిధిలోని భూములపై లెక్కలు తేల్చాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ సర్వే చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పుడు కలెక్టర్ సమర్పించనున్న నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది కీలకంగా మారింది.

## తెలంగాణ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

- **ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు**
- **2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటికి ఆమోదం**
- **డీఏల పెంపు వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ. 2,500 కోట్ల అదనపు భారం**

దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏల్లో రెండింటికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్లకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ బకాయిలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు సమావేశమైన కేబినెట్ సానుకూల నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను వారు ఈ సందర్భంగా వివరించారు. రెండు డీఏల వల్ల ప్రభుత్వంపై సుమారు రూ. 2,500 కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో




విద్యుత్ వినియోగం భారీగా పెరిగినట్లు మంత్రులు పేర్కొన్నారు. నిన్న ఒక్కరోజే 19,892 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు వారు వెల్లడించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం నిన్నటితో వర్షాకాలం ముగిసిందని, ఈ ఏడాది సగటున 17 శాతం వర్షపాతం తక్కువగా నమోదైందని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ఎల్ నినో ప్రభావంపై కేబినెట్ అత్యవసర నివేదికను సిద్ధం చేస్తోందని మంత్రులు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా 5,800 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రులు వెల్లడించారు. వీటితో పాటు 'తెలంగాణ డిజిటల్ మీడియా అండ్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ'కి కూడా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వారు పేర్కొన్నారు.

## ఆర్మీ ఆయుధాల చోరీ కేసు.. మల్లేశ్ నుంచి కీలక సమాచారం రాబట్టిన పోలీసులు

హైదరాబాద్: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసు లో నిందితుడు మల్లేశ్ కస్టడీ ముగిసింది. సెప్టెంబరు 22 నుంచి 10 రోజుల పాటు మల్లేశ్‌ను విచారించిన బొల్లారం పోలీసులు.. వైద్య పరీక్షల అనంతరం గురువారం సాయంత్రం సికింద్రాబాద్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలుకు తరలించారు. కస్టడీ విచారణలో భాగంగా నిందితుడి నుంచి పోలీసులు కీలక సమాచారం రాబట్టినట్టు తెలుస్తోంది. మల్లేశ్‌ను పోలీసులు మరోసారి కస్టడీకి కోరే అవకాశముందని సమాచారం.

# విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్

చౌటుప్పల్: హైదరాబాద్ విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ప్రజలు సొంతూళ్లకు క్యూ కట్టారు. దీనికి తోడు రోడ్డు పనులు జరుగుతుండటంతో రద్దీ పెరిగింది. చౌటుప్పల్ మండల పరిధిలోని తూప్రాన్ పేట కొయ్యలగూడెం మధ్య భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇరువైపులా కిలోమీటర్ల దూరం వాహనాలు నిలిచిపోయి.. నెమ్మదిగా కదులుతున్నాయి. తూప్రాన్ పేట నుంచి బొర్రలగూడెం వరకు జాతీయ రహదారిపై తారు వేసే పని చేపట్టారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వాహనాలు వచ్చే రోడ్డుపైకి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను మళ్లించారు.



దీంతో సమస్య మరింత జఠిలమైంది. ఈ రహదారిపై రోజుకు సుమారు 40 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. విజయవాడ వైపు వెళ్లే రోడ్డుపై నిర్మాణ పనులు జరుగుతుండడంతో అటువైపు వెళ్లే 20వేల వాహనాలను దారి మళ్లించడంతో రద్దీ ఏర్పడింది. హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్డు పైనే... మధ్యలో తాత్కాలిక బారికేడ్లను ఏర్పాటుచేసి విజయవాడ వైపున కూడా ఎదురెదురుగా వాహనాలను నడిపిస్తున్నారు. ఈ రోడ్డు సరిపోకపోవడంతో తూప్రాన్ పేట నుంచి బొర్రలగూడెం వరకు నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు గంటన్నరకు పైగా సమయం పడుతోంది. చౌటుప్పల్ పట్టణంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండడంతో ఇక్కడ సైతం ట్రాఫిక్ రద్దీ కొనసాగుతోంది. నిర్మాణ పనులు వేగవంతం చేసి ట్రాఫిక్ సమస్యను త్వరగా పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

## ఎల్‌నినో ప్రభావం.. ఈ ఏడాది చలి తీవ్రత తక్కువే: వాతావరణశాఖ

హైదరాబాద్: శీతాకాలం ఔట్ లుక్‌ను భారత వాతావరణ శాఖ (IMD) విడుదల చేసింది. వర్షాకాలం ముగిసి నేటి నుంచి శీతాకాలం ప్రారంభమైనట్లు తెలిపింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగానే ఉంటుందని పేర్కొంది. అక్టోబర్‌లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని పేర్కొంది. దేశవ్యాప్తంగా అక్టోబర్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే వీలుందని తెలిపింది. తెలంగాణలో ఈ సీజన్‌లో 18 శాతం లోటు వర్షపాతం ఉందని




వాతావరణశాఖ వెల్లడించింది. అత్యధిక లోటు వర్షపాతం జాబితాలో నల్గొండ, నిర్మల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలు ఉన్నట్లు పేర్కొంది.

## 'సర్'లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు

**: తెలంగాణ ప్రధాన ఎన్నికల కమిషనర్**

తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వారిలో 20 శాతం మంది సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 92 లక్షల మందిలో 65 లక్షల మంది నోటీసులపై స్పందించినట్లు చెప్పారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకు బీఎల్‌ఓలు వెళ్లి సంబంధిత పత్రాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ అందుబాటులో ఉండవల్సిన అవసరం లేదని, ఒక్కరు ఉండి, మిగిలిన అందరి కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందని అన్నారు.

# మహిళకు మరణశిక్ష.. రెండు ఇంజెక్షన్లు ఇచ్చినా ఆగని 'శ్వాస'!

ఓ హత్య కేసులో దోషిగా తేలిన మహిళకు మరణశిక్ష పడింది. తాజాగా శిక్ష అమలు చేసేందుకు ప్రయత్నించిన అధికారులు.. రెండు ప్రాణాంతక ఇంజెక్షన్లు ఇచ్చారు. అయినప్పటికీ ఆమె శ్వాస ఆగలేదు. దీంతో ఆమె మరణశిక్షను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. అమెరికాలోని టెన్నెసీలో ఇది చోటుచేసుకుంది. టెన్నెసీకి చెందిన క్రిస్టా గెయిల్ పైక్ 1995లో జరిగిన హత్య కేసులో నిందితురాలు. అప్పుడు ఆమె వయసు 18 ఏళ్లు. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఇటీవల ఆమెకు మరణశిక్ష పడింది. గత 200 ఏళ్లలో టెన్నెసీలో మరణశిక్ష పడిన తొలి మహిళ క్రిస్టానే కావడం గమనార్హం. ఈ క్రమంలో సెప్టెంబర్ 30న ఉదయం 10 గంటలకు శిక్ష అమలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే.. బాధిత కుటుంబీకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో అమలు ఆలస్యం అయ్యింది. చివరకు సాయంత్రానికి అధికారులు శిక్ష అమలు ప్రక్రియ మొదలుపెట్టారు. రెండు డోసుల్లో ప్రాణాంతక ఇంజెక్షన్ అందించారు. అయినప్పటికీ క్రిస్టా తుది శ్వాస విడవలేదు. ప్రాణాలతోనే ఉండడంతోపాటు పెద్దగా గురక పెట్టడం ప్రారంభించారు. దీంతో ఈ ప్రక్రియను తాత్కాలికంగా నిలివేసినట్లు అధికారులు ప్రకటించారు. వెంటనే జైలు నుంచి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ఏంటన్న విషయం ఇంకా వెల్లడి కాలేదని ఆమె తరపు న్యాయవాది చెప్పారు. ఈ వ్యవహారంలో అసలు ఏం జరిగిందనే విషయంపై థర్డ్ పార్టీ సమీక్షకు ఆదేశించినట్లు టెన్నెసీ గవర్నర్







బిల్ లీ ప్రకటించారు. మరణశిక్ష అమలును ఈ ఏడాది చివరి వరకు నిలిపివేస్తున్నామని.. అయితే, చట్టబద్ధంగా ఈ ప్రక్రియ అమలు చేయడం తమ బాధ్యత అని తెలిపారు. జైలు అధికారి రాబిన్ మహెర్ మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షల్లో ఇంజెక్షన్ తీసుకున్న వారెవరూ బతికి లేరని, ఇది అసాధారణ పరిణామమని పేర్కొన్నారు. టెన్నెసీ మరణశిక్ష అమలు నిబంధనల ప్రకారం.. శిక్ష పడిన దోషికి మొదటి విడత ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత ఖైదీ చనిపోకపోతే రెండో డోసు ఇవ్వాలి. అయితే, రెండో డోసు ఇచ్చిన తర్వాత కూడా బతికే ఉంటే ఏం చేయాలనే విషయంపై నిబంధనల్లో స్పష్టంగా పేర్కొనలేదని సమాచారం. ఇదిలాఉంటే, అమెరికాలో చాలా రాష్ట్రాలు మరణశిక్ష అమలుకు ఇంజెక్షన్ విధానాన్ని అనుసరిస్తున్నాయి.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు నిరసనలు సీజేపీ

ప్రధాన ఎన్నికల కమిషనర్ (CEC) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (CJP) దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. అక్టోబర్ 2 నుంచి ఈ నిరసనలు ప్రారంభంకానున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. సీఈసీ నియామకంలో



పారదర్శకత ఉండాలని.. పౌర సమాజానికి భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ముంబయి లోని శివాజీ పార్క్‌లో అక్టోబర్ 2న సాయంత్రం 'జైల్ భరో ఆందోళన్' చేపట్టాలని సీజేపీ నిర్ణయించింది. అయితే ఈ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం అక్కడ సభల నిర్వహణకు అనుమతి లేదని తెలిపారు. ప్రత్యామ్నాయ వేదికను ఎంచుకోవాలని సూచించారు. పోలీసులే కాకుండా.. శివాజీ పార్క్ పరిసరాల్లోని నివాసితులు కూడా ఈ నిరసనను తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తోంది.

## 'వానిష్' కుమార్‌ను ప్రజలు క్షమించరు.. సీఈసీపై మమత ఫైర్

తమ ఓటు హక్కును కాలరాసిన వారిని దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను 'వానిష్' కుమార్ అంటూ ఎద్దేవా చేశారు. ఆయన ప్రజల హక్కులను వానిష్ (మాయం) చేశారని ఆరోపించారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈమేరకు మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం కేంద్రీకృతం చేసిందని విమర్శించారు. 2023 నాటి చట్టం కింద సీఈసీ, ఇతర ఎన్నికల



కమిషనర్లకు కల్పించిన రక్షణను ప్రశ్నించారు. ''పశ్చిమ బెంగాల్‌లో 'సర్' ప్రక్రియను టీఎంసీ మొదటి నుంచే వ్యతిరేకించింది. ఈ వ్యవహారంలో కోర్టును ఆశ్రయించినా న్యాయం జరగలేదు. దాదాపు 100 మంది 'సర్' బాధితులతో కలిసి ఎన్నికల సంఘం అధికారులను కలిసేందుకు వెళ్తే.. వారు మమ్మల్ని అవమానించారు. సీఈసీని కలిసేందుకు వెళ్లిన టీఎంసీ ఎంపీలను 'వెళ్లిపోండి' అని అన్నారు'' అని మమత ఆరోపించారు. రాష్ట్రంలో దాదాపు 4,000 ఈవీఎంలను తగలబెట్టిన ఘటనల వెనుక భాజపా (BJP) హస్తం ఉందని ఆరోపించారు.

## మేధావులు, విద్యావేత్తలపై మోదీ అక్కసు: రాహుల్

దిల్లీ: ప్రధాని మోదీ సామాజిక వ్యతిరేకి అని, ఆయన వ్యవస్థ మొత్తం విద్యను ద్వేషిస్తుందని, విద్యార్థులు ఆలోచించడం, ప్రశ్నలు వేయడం ఆయనకు ఇష్టం ఉండదని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రధాని కార్యాలయం జోక్యంతో.. పలు విద్యా సంస్థల్లో పాఠ్యాంశాలుగా ఉన్న పలువురు మేధావులు, విద్యావేత్తల రచనలను ఉన్నత విద్యాశాఖ పరిశీలిస్తోందని వచ్చిన మీడియా కథనాలను రాహుల్ బుధవారం సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ రచనలను విషంతో పోల్చిన ఓ సోషల్ మీడియా పోస్టుతో ఈ విచారణ మొదలైందని ఆరోపించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన కుల నిర్మూలన, జ్యోతిబా ఫులే



రచించిన గులాంగిరి పుస్తకాలు విషం ఎక్కిస్తున్నాయని ఆ అనామక పోస్టులో పేర్కొన్నారని, దానిని పరిగణనలోకి తీసుకుని ప్రధాని కార్యాలయం జోక్యం చేసుకోవడం దారుణమని రాహుల్ వ్యాఖ్యానించారు. ''అనామక పోస్టు వచ్చిన మరుసటి రోజే ప్రధాని కార్యాలయం ఆదేశాలతో కేంద్ర విశ్వవిద్యాలయాల్లో సిలబస్ గురించి, ఆ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థుల గురించి కేంద్ర విద్యాశాఖ సమాచారం కోరింది. ఇది షాక్‌కు గురిచేసే అంశం. పేపర్ లీక్‌లు, నిరుద్యోగం, యువత భద్రత గురించి మాట్లాడని ప్రధాని.. ఆన్‌లైన్‌లో వచ్చిన ట్రోల్స్‌పై వెంటనే స్పందించడం దిగ్భ్రాంతికరం'' అని రాహుల్ పేర్కొన్నారు.

## ఇప్పుడు స్మిత్.. నాడు నీర్జా
# తూటాలు చీల్చినా ప్రయాణికులను కాపాడిన ఆమె..!

కళ్లముందు మృత్యువు కన్పిస్తున్నా.. ఎదురొడ్డి పోరాడారు భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ (Indian Captain Smit Machchhar). తన ప్రాణం కంటే ప్రయాణికుల ప్రాణాలే ముఖ్యమని భావించారు. ఫ్లైదుబాయ్ విమానంలో (Fly dubai Plane) జరిగిన పోరాటంలో ఆయన గాయపడినా.. ఎంతోమంది ప్రాణాలను కాపాడగలిగారు. సరిగ్గా నాలుగు దశాబ్దాల క్రితం మరో భారతీయురాలికి విమానంలో ఇలాంటి ప్రాణాపాయ పరిస్థితే ఎదురైంది. అప్పుడు ఆమె కూడా తన గురించి ఆలోచించుకోలేదు. ఉగ్రవాదుల నుంచి ప్రయాణికులను కాపాడే క్రమంలో ఏకంగా ప్రాణత్యాగమే చేసింది. ఆమే ఫ్లైట్ అటెండెంట్ నీర్జా భనోట్.

**ఉగ్రవాదులు హైజాక్ చేయడంతో..**

చండీగఢ్‌కు చెందిన నీర్జా.. అమెరికాకు చెందిన 'పాన్ ఆమ్ ఎయిర్‌లైన్స్'లో విధులు నిర్వహించేవారు. 1986 సెప్టెంబరు 5న ఈ సంస్థకు చెందిన ఓ విమానం ముంబయి నుంచి న్యూయార్క్ బయల్దేరింది. మధ్యలో పాకిస్థాన్‌లోని కరాచీ విమానాశ్రయంలో ఆగింది. కాసేపటి తర్వాత విమానం టేకాఫ్ అవుతుందనగా ఒక్కసారిగా కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఊహించని పరిస్థితికి ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎయిర్‌పోర్టు సిబ్బంది దుస్తుల్లో ఉన్న నలుగురు ఉగ్రవాదులు.. తుపాకులతో బయటకు వచ్చి విమానాన్ని హైజాక్ (Plane Hijack) చేస్తున్నట్లు చెప్పారు. సాధారణంగా అలాంటి సమయంలో ఎవరైనా కంగారుపడుతారు. ప్రాణాలు కాపాడుకునేందుకే ఆలోచిస్తారు. కానీ, నీర్జా అలా చేయలేదు. చాలా సమయస్ఫూర్తితో వ్యవహరించి వెంటనే కాక్‌పిట్ సిబ్బందిని అలర్ట్ చేశారు. దీంతో ఉగ్రవాదులు విమానాన్ని తమ నియంత్రణలోకి తీసుకోకుండా పైలట్లు నిలువరించగలిగారు. ఆ తర్వాత విమానంలోని అమెరికా ప్రయాణికుల కోసం హైజాకర్లు ప్రయత్నించారు. వారిని బంధించి అగ్రరాజ్యంతో తమ డిమాండ్లను నెరవేర్చుకోవాలన్నది ఉగ్రవాదుల ప్లాన్. అందుకే, అందరి పాస్‌పోర్టులు తేవాలని వారు నీర్జాతో పాటు ఇతర సిబ్బందిని బెదిరించారు. కానీ, ఆమె వారికి ఆ వివరాలు అందించలేదు. అమెరికా ప్రయాణికుల పాస్‌పోర్టులు దాచిపెట్టారు.

**ముగ్గురు పిల్లలకు కవచంగా మారి..**

దాదాపు 17 గంటల పాటు ఈ హైజాక్ ఘటన చోటుచేసుకుంది. ప్రయాణికులను విడిపించేందుకు అధికారులు నిరంతరం సంప్రదింపులు జరిపినా అవి కొలిక్కి రాలేదు. ఈ క్రమంలోనే విమానంలో ఇంధనం నిండుకుని లైట్లు ఆగిపోయాయి. అదే సరైన సమయంగా భావించిన నీర్జా.. ప్రయాణికులను కాపాడేందుకు చాలా ధైర్యం చేశారు. నెమ్మదిగా మూడు ఎగ్జిట్ డోర్లను తెరిచి ఒక్కొక్కరినీ కిందకు పంపించడం మొదలుపెట్టారు. ఈ అలికిడి గమనించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో కొంతమంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. అయినా, ఆమె భయపడలేదు. ముగ్గురు పిల్లలను తూటాల నుంచి కాపాడేందుకు ఆమె కవచంగా మారారు. ఆ చిన్నారులను బయటకు పంపిస్తుండగా ఉగ్రవాదుల కాల్పులకు నీర్జా బలయ్యారు. ఈ ఘటన సమయంలో విమానంలో దాదాపు 400 మంది





ప్రయాణికులున్నారు. కాల్పుల్లో కనీసం 20 మంది మరణించగా.. మరో 100 మంది గాయపడ్డారు. నాడు ఉగ్రవాదులు పోలీసులకు చిక్కలేదు.

**పుట్టినరోజుకు రెండు రోజుల ముందే..**

1963 సెప్టెంబరు 7న చండీగఢ్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబంలో నీర్జా జన్మించారు. తండ్రి హరీశ్ భనోట్ విలేకరి. తొలుత మోడలింగ్ వైపు ఆసక్తికనబర్చిన ఆమె.. ఆ తర్వాత అనూహ్యంగా విమానయాన రంగంలోకి వచ్చారు. సరిగ్గా నీర్జా పుట్టినరోజుకు రెండు రోజుల ముందే హైజాక్ ఘటనలో ఆమె ప్రాణాలు కోల్పోవడం మరింత విషాదకరం. ఆ సమయంలో ఆమె వయసు కేవలం 22 ఏళ్లే. నీర్జా ధైర్యసాహసాలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం మరణానంతరం 'అశోక చక్ర' పురస్కారంతో గౌరవించింది. అత్యంత పిన్న వయసులో ఈ పురస్కారం పొందిన తొలి మహిళ ఈమే. నీర్జా జీవితం ఆధారంగా 2016లో బాలీవుడ్‌లో ఆమె పేరుతోనే సినిమా తెరకెక్కింది. ప్రముఖ నటి సోనమ్ కపూర్.. నీర్జాగా మెప్పించారు.

## ఆ పైలట్‌కు 'ఉగ్ర' భావజాలం: నెతన్యాహు

ఫ్లైదుబాయ్ విమానంలో దాడికి పాల్పడిన పైలట్.. ఉగ్రవాద భావజాలానికి లోనయ్యాడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. అయితే.. అతడు ఆ భావజాలం వైపు మళ్లడం వెనుక ఎవరి ప్రమేయం ఉందనే విషయం మాత్రం తమకు తెలియదన్నారు. దీని వెనుక ఇరాన్ హస్తం ఉందా? అనే ప్రశ్నపై స్పందిస్తూ.. ఇప్పుడే చెప్పడం తొందరపాటే అవుతుందన్నారు. మరోవైపు.. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ''ఉగ్రవాదం నుంచి మానసిక సమస్యల వరకు.. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోంది. ప్రస్తుతానికి దేన్నీ కొట్టిపారేయడం లేదు'' ఓ అధికారి తెలిపారు. పైలట్ ఉద్దేశాన్ని తెలుసుకునేందుకు సౌదీ అధికారులు ఇజ్రాయెల్ సహా పలు దేశాలతో కలిసి పనిచేస్తున్నారని చెప్పారు. యూఏఈ, అమెరికా, ఒమన్ కూడా పాలుపంచుకుంటున్నాయని వెల్లడించారు. విచారణ నిమిత్తం ఆ పైలట్‌ను తమకు అప్పగించాలని సౌదీకి ఇజ్రాయెల్ విజ్ఞప్తి చేసిందన్నారు. యూఏఈ సైతం సొంత దర్యాప్తు ప్రారంభించింది. ఆ విమానం తమ దేశంలో రిజిస్టర్ అయి ఉందని, అందులో జరిగే నేరాలకు తమ చట్టం వర్తిస్తుందని పేర్కొంది. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు నెతన్యాహు తెలిపారు.



* **స్మిత్ మచ్చర్ కోలుకుంటున్నారు..: భారత ఎంబసీ**

ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భారత పైలట్ స్మిత్ మచ్చర్ (Smit Machchhar) ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం మెరుగ్గా ఉందని, ఆయన కోలుకుంటున్నట్లు యూఏఈలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మచ్చర్‌తోపాటు ఆయన కుటుంబాన్ని స్థానిక భారత రాయబారి దీపక్ మిత్తల్ పరామర్శించినట్లు తెలిపింది. వైద్య సేవల విషయంలో స్థానిక అధికారులతో ఎంబసీ సమన్వయం చేసుకుంటోందని పేర్కొంది. తొలుత సౌదీ అరేబియాలోని తబూక్‌లో చికిత్స పొందిన స్మిత్‌ను నేడు యూఏఈకి తరలించిన విషయం తెలిసిందే.

## ఫ్లైదుబాయ్ ఘటన.. గొడ్డలితో దాడి చేశాడా?

ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో భారత పైలట్ స్మిత్ మచ్చర్‌పై కోపైలట్ దాడి చేసిన ఘటనలో అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. పైలట్‌పై దాడికి కత్తిని వాడినట్లు తొలుత కథనాలు వచ్చాయి. దీంతో పదునైన ఆయుధం కాక్‌పిట్‌లోకి ఎలా వచ్చిందనే ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు చేస్తున్న అధికారులు.. దాడికి కత్తి ఉపయోగించలేదని, క్రాష్ యాక్స్‌ను వాడి ఉంటాడని భావిస్తున్నారు. పైలట్‌పై దాడి చేసేందుకు కోపైలట్ బయట నుంచి ఎలాంటి ఆయుధం తేలేదని దర్యాప్తు అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు. కాక్‌పిట్‌లో ఉండే గొడ్డలి మాదిరి పదునైన పరికరంతోనే దాడి చేసినట్లు భావిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు



కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు.

**కాక్‌పిట్‌లో ఎందుకు ఉంది?**

అంతర్జాతీయ విమానయాన నిబంధనల ప్రకారం.. ఈ క్రాష్ యాక్స్ పరికరాన్ని విమాన తయారీ సమయంలో ఫ్యాక్టరీలోనే అమర్చుతారు. అత్యవసర భద్రతా పరికరాల్లో ఒకటైన దీనిని ప్రతి వాణిజ్య విమానంలో తప్పనిసరిగా ఉంచుతారు. విమానం కూలిపోయిన సందర్భాల్లో లేదా ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో తలుపులు జామ్ అయినప్పుడు.. అత్యవసర మార్గం ఏర్పాటు చేసేందుకు దీనిని ఉపయోగిస్తారు. ప్రయాణికులకు కాకుండా పైలట్లు, సిబ్బందికి మాత్రమే అందుబాటులో ఉండేలా భద్రపరుస్తారు. గతంలో దీనిని మెయిన్ క్యాబిన్‌లోనే ఉంచేవారు. కానీ, అమెరికాలో 9/11 ఉగ్రదాడి తర్వాత (ప్రయాణికులకు అందుబాటులో ఉండకుండా) నుంచి భద్రతా కారణాల దృష్ట్యా కాక్‌పిట్‌లోకి మార్చారు.

## బీచ్‌లో విషాదం.. ఎనిమిది మంది విద్యార్థుల మృతి

మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విహారయాత్రలో భాగంగా బీచ్‌కు వెళ్లిన విద్యార్థుల్లో ఎనిమిది మంది నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుణె జిల్లాలోని ఓ ప్రైవేట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు, సిబ్బంది రాయ్‌గఢ్ జిల్లాలోని దివేఅగర్ బీచ్‌కు పిక్నిక్‌కు వెళ్లారు. వీరిలో 25 మంది బాలురు, 17 మంది బాలికలు, ఆరుగురు ఉపాధ్యాయులు సహా మొత్తం 48 మంది ఉన్నారు. ఈ క్రమంలోనే సముద్రంలో దిగిన ఎనిమిది మంది విద్యార్థులు నీటి లోతు, ప్రవాహాన్ని అంచనా వేయలేక కొట్టుకుపోయారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు.. ఎనిమిది మంది మృతదేహాలను వెలికితీశాయని పోలీసులు తెలిపారు.



# క్రియేటర్లకు ఇక డేటానే గైడ్..

**ఇన్‌స్టాగ్రామ్ తన ఎడిట్స్ యాప్‌లో కొత్త ఏఐ వీడియో ఎడిటింగ్ టూల్‌ను తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. క్యాప్‌కట్‌కు పోటీగా ఇన్‌స్టాగ్రామ్ తీసుకొచ్చిన ఎడిట్స్ యాప్‌లో ఈ ఫీచర్ అందుబాటులోకి రానుంది. సాధారణంగా అందరికీ ఒకే రకమైన సూచనలు ఇచ్చే ఏఐ టూల్స్‌కు భిన్నంగా, ఈ సంభాషణాత్మక ఏఐ అసిస్టెంట్ ప్రతి ఒక్క క్రియేటర్‌కు వ్యక్తిగతంగా ఉపయోగపడేలా సూచనలు, విశ్లేషణ అందించనుంది. ఎడిట్స్ యాప్‌కు నాయకత్వం వహిస్తున్న బ్రెట్ వెస్టర్‌వెల్ట్ బ్లాగ్ పోస్టులో ఈ ఏఐ అసిస్టెంట్ ఎలా పనిచేస్తుందో వివరించారు. క్రియేటర్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు సంబంధించిన ఫాలోస్, వ్యూస్, వీడియో రిటెన్షన్, లైక్స్, షేర్స్ వంటి మెట్రిక్స్‌ను ఈ అసిస్టెంట్ తెలుసుకుంటుందని ఆయన తెలిపారు. వీటితోపాటు క్రియేటర్ పోస్టులకు వచ్చిన కామెంట్లు, ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రస్తుతం ట్రెండ్ అవుతున్న అంశాలు, సంబంధిత ఆడియన్స్ ఆసక్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు.**




క్రియేటర్ పనితీరులో కాలక్రమేణా ఏర్పడుతున్న నమూనాలను ఈ టూల్ గుర్తిస్తుందని వెస్టర్‌వెల్ట్ తెలిపారు. కేవలం మెట్రిక్స్‌ను చూడడం ద్వారా గుర్తించడం కష్టమైన అంశాలను కూడా విశ్లేషించి, వాటి ఆధారంగా ఉపయోగకరమైన సూచనలను అందించనుంది. అంటే ఒక క్రియేటర్ సొంత పనితీరు డేటాను ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌లోని ట్రెండ్స్, ఆడియన్స్ ప్రవర్తనతో కలిపి విశ్లేషించి అవసరమైన సూచనలు ఇవ్వనుంది. ఈ టూల్‌ను రూపొందించే సమయంలో ఎడిట్స్ టీమ్ కొంతమంది క్రియేటర్లతో కలిసి పనిచేసిందని వెస్టర్‌వెల్ట్ తెలిపారు. ఈ ప్రక్రియలో క్రియేటర్లు పదేపదే ఒక విషయాన్ని చెప్పారని ఆయన వెల్లడించారు. తమ సృజనాత్మక నిర్ణయాలను ఏఐ తీసుకోవడం కంటే, డేటా విశ్లేషణకు సంబంధించిన భారాన్ని ఏఐ చూసుకోవాలని వారు కోరుకున్నారని చెప్పారు. క్రియేటర్ల కోసం ఎడిట్స్ అసిస్టెంట్ అవసరమైన విశ్లేషణను స్వయంగా చేస్తుందని, అయితే సృజనాత్మక నిర్ణయాలు మాత్రం క్రియేటర్ల చేతుల్లోనే ఉంటాయని వెస్టర్‌వెల్ట్ పేర్కొన్నారు. అంటే ఏ వీడియో చేయాలి, ఏ విధంగా రూపొందించాలి అనే తుది నిర్ణయాన్ని ఏఐ తీసుకోదు. దానికి బదులుగా క్రియేటర్ కంటెంట్ ఎలా పనిచేస్తోంది, ఆడియన్స్ ఏ అంశాలకు స్పందిస్తోంది వంటి విషయాలను అర్థం చేసుకోవడంలో సహాయపడుతుంది.

**పెయిడ్ సబ్‌స్క్రిప్షన్‌తో అధిక వినియోగం..**

మెటా తొలిసారిగా ఎడిట్స్ ఏఐ అసిస్టెంట్‌ను జూన్‌లో క్రియేటర్ల కోసం నిర్వహించిన ఆహ్వానిత కార్యక్రమంలో ప్రదర్శించింది. అదే సమయంలో ఎడిట్స్ యాప్‌కు డెస్క్‌టాప్ వెర్షన్‌పై కూడా పనిచేస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇలాంటి టూల్స్‌పై పనిచేస్తున్న మరో సంస్థ యూట్యూబ్. యూట్యూబ్ గత వారం తన సొంత సంభాషణాత్మక వీడియో ఎడిటింగ్ టూల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది వచ్చే ఏడాది ప్రారంభంలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ఇప్పటివరకు వెల్లడైన వివరాలను పరిశీలిస్తే, మెటా రూపొందిస్తున్న ఏఐ అసిస్టెంట్ ప్రధానంగా విశ్లేషణపై దృష్టి పెడుతోంది. క్రియేటర్లు తమ పనితీరు డేటాను అర్థం చేసుకునేందుకు ఇది సహాయపడుతుంది. మరోవైపు, యూట్యూబ్ రూపొందిస్తున్న ఏఐ టూల్ నేరుగా వీడియో ఎడిటింగ్ ప్రక్రియలో సహాయం చేసే దిశగా ఉండనుంది. దీంతో ఒకే తరహా లక్ష్యంతో కనిపిస్తున్నప్పటికీ, రెండు సంస్థలు ఈ టూల్స్‌ను భిన్నమైన విధానాల్లో అభివృద్ధి చేస్తున్నాయి. క్రియేటర్లు ఈ ఏఐ అసిస్టెంట్‌ను అపరిమితంగా ఉపయోగించలేరు. దీనిపై వినియోగ పరిమితి ఉంటుందని ఇన్‌స్టాగ్రామ్ తెలిపింది. అయితే మెటా వన్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవడం ద్వారా ఈ వినియోగ పరిమితిని పెంచుకునే అవకాశం ఉంటుంది.

# టీనేజర్లపై మరింత కంట్రోల్..

- **వాట్సాప్‌లో కొత్త ఫీచర్లు..**

**తాజా భద్రతా ఆందోళనల నేపథ్యంలో ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ టీనేజర్ల కోసం కొత్త పేరెంటల్ కంట్రోల్ ఫీచర్లను ప్రకటించింది. వాట్సాప్ తన బ్లాగ్‌పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. టీన్‌ల కోసం పేరెంటల్ కంట్రోల్స్‌ను పరిచయం చేస్తున్నామని, తల్లిదండ్రులు, టీనేజర్లు కలిసి ఏర్పాటు చేసుకునేలా వీటిని రూపొందించామని తెలిపింది. తమ టీనేజర్‌కు సరైన ప్రైవసీ సెట్టింగులను తల్లిదండ్రులు ఎంచుకోవచ్చు. టీనేజర్ ప్రొఫైల్ ఫొటోను ఎవరు చూడాలి, వారిని గ్రూపుల్లో ఎవరు యాడ్ చేయవచ్చు వంటి అంశాలను తల్లిదండ్రులు నియంత్రించవచ్చు. టీనేజర్ ఈ సెట్టింగుల్లో దేన్నయినా సడలించాలనుకుంటే, తల్లిదండ్రులు ఏర్పాటు చేసిన పిన్ ద్వారా అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపింది.**



టీనేజర్ ఏదైనా గ్రూప్‌లో చేరినా లేదా గ్రూప్ నుంచి బయటకు వచ్చినా తల్లిదండ్రులకు నోటిఫికేషన్ వస్తుంది. ఏదైనా గ్రూప్ సభ్యుల సంఖ్య భారీగా పెరిగినా తల్లిదండ్రులకు సమాచారం అందుతుంది. టీనేజర్ ఛానళ్లను ఎలా ఉపయోగించాలి, ఎవరి స్టేటస్ అప్‌డేట్లను చూడవచ్చు, తమ స్టేటస్‌ను ఎవరు చూడవచ్చు వంటి అంశాలను కూడా తల్లిదండ్రులు నిర్ణయించవచ్చు. మెటా ఏఐ విషయంలోనూ టీనేజర్లకు సరైన అనుభవాన్ని తల్లిదండ్రులు ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఇందులో డిఫాల్ట్ 13 ప్లస్ సెట్టింగ్‌తోపాటు మరింత కఠినమైన లిమిటెడ్ కంటెంట్ ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. 'ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని, కుటుంబాలు తమకు అవసరమైన అంశాలను తెలియజేస్తున్న కొద్దీ ఈ కంట్రోల్స్‌ను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని వాట్సాప్ తెలిపింది. ఈ కంట్రోల్స్ ద్వారా తల్లిదండ్రులు, టీనేజర్ల మధ్య వాట్సాప్‌ను ఎలా ఉపయోగించాలనే అంశంపై బహిరంగ చర్చలకు ప్రోత్సాహం లభించేలా చూస్తున్నామని, అదే సమయంలో ప్రతి ఒక్కరి వ్యక్తిగత సందేశాల గోప్యతను కాపాడుతున్నామని తెలియజేసింది.

**ఆప్షనల్ మాత్రమే..**

ప్రతి కుటుంబ అవసరాలు భిన్నంగా ఉంటాయని పేర్కొన్న వాట్సాప్, టీనేజర్ల కోసం తీసుకొచ్చిన పేరెంటల్ కంట్రోల్స్‌ను పూర్తిగా ఆప్షనల్‌గా ఉంచింది. టీనేజర్‌కు ఎంత మేరకు సహాయం అవసరమో తల్లిదండ్రులు నిర్ణయించుకోవచ్చు. అవసరాన్ని బట్టి ఈ కంట్రోల్స్‌ను ఎప్పుడైనా మార్చుకోవచ్చు లేదా పూర్తిగా ఆఫ్ చేయవచ్చు. పేరెంటల్ కంట్రోల్స్ ఆన్‌లో ఉన్నప్పటికీ టీనేజర్ వ్యక్తిగత సందేశాలు, కాల్స్ మాత్రం ప్రైవేట్‌గానే ఉంటాయని వాట్సాప్ స్పష్టం చేసింది. ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ కారణంగా చాట్‌లో ఉన్న వ్యక్తులు మినహా ఇతరులు, వాట్సాప్ కూడా ఆ సందేశాలను చూడలేదని లేదా కాల్స్ వినలేదని కంపెనీ తెలిపింది. ఈ ఏడాది ప్రారంభంలోనే వాట్సాప్ చిన్న వయసు వినియోగదారులు ప్లాట్‌ఫామ్‌ను ఎలా ఉపయోగిస్తున్నారో తల్లిదండ్రులు పర్యవేక్షించేందుకు పేరెంటల్ కంట్రోల్ ఫీచర్‌ను ప్రకటించింది. ఈ టూల్ ద్వారా తల్లిదండ్రులు కమ్యూనికేషన్ సెట్టింగులను మార్చడంతోపాటు కొన్ని ఆప్షన్లను పరిమితం చేయవచ్చు. 13 ఏళ్లలోపు పిల్లలు ప్రధానంగా మెసేజింగ్, కాల్స్ కోసం యాప్‌ను ఉపయోగించేలా చేయడమే ఈ ఫీచర్ ఉద్దేశం. కుటుంబాలు, భద్రతా నిపుణులతో నిర్వహించిన సంప్రదింపుల అనంతరం ఈ కార్యక్రమాన్ని అభివృద్ధి చేసినట్లు వాట్సాప్ తెలిపింది. 13 ఏళ్లలోపు వారికి మరింత నియంత్రిత అనుభవాన్ని అందించడమే దీని లక్ష్యంగా పేర్కొంది.




## శనివారం సెలవు ఇంకా నిర్ణయించలేదు

ప్రభుత్వ రంగ బ్యాంకులకు ప్రతి శనివారం సెలవు ప్రకటించారంటూ ఇవాళ ఉదయం నుంచి తెగ ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ గెజిట్ జాతీయ మీడియా, సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ ప్రచారంపై ప్రభుత్వం స్పందించింది. మీడియాలో వచ్చిన కథనాలను ఖండించింది. అవన్నీ తప్పుడు వార్తలని కొట్టిపారేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులకు ప్రతి శనివారం సెలవు ప్రకటిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎలాంటి గెజిట్ విడుదల చేయలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు తప్పుడు కథనాలకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తో చెక్ పెట్టింది. కాగా, ప్రతి శనివారం సెలవు దినంగా ప్రకటించాలంటూ బ్యాంకు ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. వారానికి ఐదు పనిదినాలు కోరుతూ బ్యాంకు యూనియన్లు ఇటీవలే సమ్మెకు సిద్ధమైన విషయం తెలిసిందే. అయితే, ప్రభుత్వంతో చర్చల అనంతరం చివరి నిమిషంలో తమ సమ్మెను విరమించుకున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి శనివారం సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసినట్లు వార్తలు పుట్టుకొచ్చాయి. దీనిపై కేంద్రం తాజాగా క్లారిటీ ఇచ్చింది. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు ప్రభుత్వం ఎలాంటి గెటిజ్ విడుదల చేయలేదని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ ద్వారా స్పష్టం చేసింది.




# జీఎస్‌టీ వసూళ్లు రూ.2.04 లక్షల కోట్లు

- **14.7 శాతం వృద్ధి..**

**సెప్టెంబర్‌లో** వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. గురువారం విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం, సెప్టెంబర్‌లో స్థూల జీఎస్‌టీ వసూళ్లు ఏడాది 14.7 శాతం పెరిగి రూ.2.04 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దేశీయంగా వసూలైన స్థూల జీఎస్‌టీ ఆదాయం రూ.1.38 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది గతేడాది ఇదే నెలతో పోలిస్తే 10.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. దిగుమతులపై వచ్చిన జీఎస్‌టీ ఆదాయం 25.9 శాతం పెరిగి సెప్టెంబర్‌లో రూ.65,525 కోట్లకు చేరుకుంది.

**తగ్గిన జీఎస్టీ రీఫండ్లు..**

సెప్టెంబర్‌లో జీఎస్‌టీ రీఫండ్లు రూ.27,001 కోట్లకు తగ్గాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే రీఫండ్లలో 3 శాతం తగ్గుదల నమోదైంది. రీఫండ్లను మినహాయించిన తర్వాత సెప్టెంబర్‌లో నికర జీఎస్‌టీ ఆదాయం 18.1 శాతం పెరిగి రూ.1.77 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాలు వెల్లడించాయి. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు స్థూల జీఎస్‌టీ వసూళ్లు 11.6 శాతం పెరిగి రూ.12.46 లక్షల కోట్లకు పైగా నమోదయ్యాయి.

పత్రికతో.. మార్పులు
TN తెలుగు న్యూస్
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..
దిన పత్రిక



# లేడీ సూపర్ హీరోగా?



కథానాయికగా నయనతార నటిస్తోన్న ఐదు సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. కెరీర్‌లో ఫస్ట్ టైమ్ సూపర్ హీరో కథతో ఓ లేడీ ఓరియెంటెడ్ సినిమా చేయబోతుంది. డీమాంటే కాలనీ ఫ్రాంచైజ్ సినిమాలతో కోలీవుడ్ ప్రేక్షకులను భయపెట్టాడు అజయ్ జ్ఞానముత్తు. డీమాంటే కాలనీ 3 తర్వాత సూపర్ హీరో కథతో లేడీ ఓరియెంటెడ్ మూవీని రూపొందించే ప్రయత్నాల్లో జ్ఞానముత్తు ఉన్నారు. లేడీ సూపర్ హీరో కథతో రూపుదిద్దుకోనున్న ఈ సినిమాలో నయనతార కథానాయికగా కనిపించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మైథాలజీ, హారర్ ఎలిమెంట్స్‌కు సూపర్ హీరో పాయింట్‌ను జోడించి సిద్ధం చేసిన కథ నచ్చడంతో నయన్ ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెబుతున్నారు.



# రూమర్లకు చెక్

హీరోయిన్‌గా ఇప్పటి వరకు తెలుగుతో పాటు తమిళంలో సినిమాలు చేసిన భాగ్యశ్రీ బోర్సే తాజాగా మలయాళంలోకి ఎంట్రీ ఇవ్వబోతుంది. అగ్ర నటుడు మోహన్‌లాల్‌తో ఓ సినిమాను అంగీకరించింది. ఆపరేషన్ గంగ పేరుతో రూపొందుతోన్న ఈ సినిమాను ఇటీవలే అఫీషియల్‌గా అనౌన్స్‌చేశారు. డేట్స్ ఇష్యూతో పాటు దర్శకనిర్మాతలతో ఏర్పడిన విభేదాలు కారణంగా ఈ సినిమా నుంచి భాగ్యశ్రీ తప్పుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మలయాళ డెబ్యూ మూవీ ఛాన్స్‌ను మిస్ చేసుకున్నట్లు సోషల్ మీడియాలో కామెంట్లు, పోస్ట్‌లు కనిపించాయి. ఈ రూమర్లకు ఓ ఫొటోతో చెక్ పెట్టింది భాగ్యశ్రీ బోర్సే. ఆపరేషన్ గంగ షూటింగ్ సెట్స్‌లో మోహన్‌లాల్‌తో కలిసి దిగిన ఓ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. మీతో కలిసి సినిమా చేయడం ఆశీర్వాదంగా భావిస్తున్నాను. ఈ సినిమా సెట్స్‌లో మీ నుంచి ఎంతో నేర్చుకుంటున్నాను అంటూ ఈ పోస్ట్‌కు కామెంట్‌ను జోడించింది. ఈ ఫొటోతో మలయాళం డెబ్యూ మూవీ నుంచి తప్పుకుంటున్నట్లు వస్తోన్న రూమర్లకు భాగ్యశ్రీ బోర్సే చెక్ పెట్టింది.



# ఓటీటీలోకి దిఇండియా స్టోరీ

కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ది ఇండియా స్టోరీ ఈ ఏడాది బాలీవుడ్‌లో బిగ్గెస్ట్ డిజాస్టర్స్‌లో ఒకటిగా నిలిచింది. 30 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ థియేటర్లలో కేవలం కోటి కలెక్షన్స్ మాత్రమే రాబట్టింది. తాజాగా ఈ బాలీవుడ్ మూవీ తెలుగులో రిలీజైంది. జియో హాట్‌స్టార్‌లో తెలుగుతో పాటు తమిళ వెర్షన్లు స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చాయి. ఈ విషయాన్ని ఓటీటీ ప్లాట్‌ఫామ్ అఫీషియల్‌గా ప్రకటించింది. థియేటర్లలో కూడా ఈ సినిమాను హిందీతో పాటు తెలుగు, తమిళంలో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. డబ్బింగ్ పనుల ఆలస్యం కావడంతో హిందీలో విడుదల చేసిన కొద్ది రోజుల గ్యాప్ తర్వాత దక్షిణాది భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకున్నారు. కానీ బాలీవుడ్‌లో ది ఇండియా స్టోరీ డిజాస్టర్‌గా నిలవడంతో తెలుగు, తమిళ వెర్షన్లను నేరుగా ఓటీటీలో విడుదల చేశారు.



# షూటింగ్‌లో బిగ్‌బీ మోకాలికి గాయం

కౌన్ బనేగా కరోడ్‌పతి షో 18వ సీజన్ షూటింగ్‌లో కార్యక్రమ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ గాయపడ్డారు. తాజాగా జరిగిన షూటింగ్‌లో తాను జారి పడ్డానని స్వయంగా వెల్లడించారు. దీంతో తన మోకాలికి గాయమైందని చెప్పారు. దీంతో ఎప్పటిలా నిల్చొని కాకుండా ఈ సారి కూర్చొనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాధారణంగా ఆయన కేబీసీ ప్రారంభంలో స్టేజ్ మధ్యలో నిల్చొని కంటెస్టెంట్‌లకు ఆయన స్వాగతం పలుకుతారు. అయితే తన మోకాలికి గాయం కావడంతో నిలబడటానికి కొంత ఇబ్బంది ఎదురవుతున్నదని ప్రేక్షకులకు చెప్పారు. అయితే పోటీదారులను ఆహ్వానించడానికి తాను సీట్ వద్దే నిలబడతానని వెల్లడించారు. అభిమానులు ఎవరూ తన గాయం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దీంతో ఆయన త్వరగా కోలుకోవాలని అభిమానులు సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతున్నారు.



# రవితేజ సరసన ప్రియాంక మోహన్

ఇరుముడి సక్సెస్‌తో ఫుల్ జోష్‌లో ఉన్నారు రవితేజ. దాని తరువాత ఓ మల్టీస్టారర్‌తో పాటు మరో హారర్ మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు రవితేజ. ఇందులో హారర్ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నారు. బ్రోచేవారెవరురా, సరిపోదా శనివారం, మెంటల్ మదిలో వంటి క్లాస్ సినిమాలను తెరకెక్కించిన వివేక్ ఆత్రేయ తన పంథాకు భిన్నంగా హారర్ జానర్‌లో ఫస్ట్ టైమ్ సినిమా చేయ బోతున్నారు. భిన్నమైన పాయింట్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు తులాభారం అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. తులాభారం సినిమాలో రవితేజ కు జోడీగా ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఓజీ తర్వాత తెలుగు సినిమాలకు కొంత గ్యాప్ ఇచ్చిన ఈ కోలీవుడ్ బ్యూటీ రవితేజ సినిమాతో మళ్లీ కమ్‌బ్యాక్ ఇవ్వబోతుంది.

# ఎట్టకేలకు థియేటర్లలోకి గోట్

జబర్ధస్థ్ కమెడియన్ సుడిగాలి సుధీర్ హీరోగా నటించిన గోట్ మూవీ అనేక వివాదాలు, అడ్డంకులను దాటుకొని ఎట్టకేలకు థియేటర్లలోకి రాబోతుంది. ఈ సినిమాను నవంబర్ 12న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కిన గోట్ మూవీలో సుడిగాలి సుధీర్ సరసన కోలీవుడ్ బ్యూటీ దివ్య భారతి హీరోయిన్‌గా నటిస్తోంది. వేదవ్యాస్ దర్శకత్వం వహిస్తున్నారు. గోట్ మూవీ షూటింగ్ నుంచే అనేక వివాదాలను ఎదుర్కొంది. డైరెక్టర్ తనతో అసభ్యంగా ప్రవర్తించారంటూ హీరోయిన్ దివ్యభారతి ఆరోపణలు చేసింది. నిర్మాతలతో ఏర్పడిన విభేదాలతో పాటు సినిమాలోని కొన్ని సీన్లు లీక్ కావడంతో డైరెక్టర్ నరేష్ కుప్పిలి గోట్ నుంచి తప్పుకున్నారు. ఈ లీకుల గొడవ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. చివరికి ఎట్టకేలకు థియేటర్లలోకి ఈ సినిమా రానుంది.

